వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

అనకాపల్లి పట్టణంలో శనివారం గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం వైభవంగా ప్రారంభమైంది. మెయిన్‌రోడ్డులోని కుంచావారి గౌరీ పరమేశ్వరులు, విజయరామరాజుపేటలోని గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం వైభవంగా జరిగింది. రెండు చోట్ల తెల్లవారుజామున గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కమిటీల ప్రతినిధులకు భక్తులకు దర్శనం కల్పించారు.

- వార్త 8వ పేజీలో..



కుంచావారి గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న భక్తులు

నేవీ రిహార్సల్స్

4న సాహస విన్యాసాల ప్రదర్శన

సాగర తీరం శనివారం సాయంత్రం బాంబు పేలుళ్లతో మోతెక్కిపోయింది. ఆకాశం నుంచి ఊడిపడినట్టుగా మెరైన్ కమాండోలు పారాచూట్ల సాయంతో కిందికి దిగి నైపుణ్యం ప్రదర్శించారు. జనవరి 4వ తేదీన నిర్వహించనున్న సాహస విన్యాసాల ప్రదర్శనలో భాగంగా శనివారం తూర్పు నౌకాదళం రిహార్సల్స్ నిర్వహించింది. ఇందులో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, నిఘా విమానాలు, యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు పాల్గొన్నాయి. శత్రు స్థావరంపై దాడి, సముద్రంలో మునిగిపోతున్న వారిని రక్షించడం, సముద్రంలో వెళుతున్న నౌకపై హెలికాప్టర్లను ల్యాండింగ్ చేయడం వంటి అంశాలను ప్రదర్శించారు.
నల్లదస్తులతో మెరైన్ కమాండోలు ప్రదర్శించిన సాహసాలు నగర ప్రజలను ఆకట్టుకున్నాయి. -విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి



..... మరిన్ని ఫొటోలు 8వ పేజీలో

కూటమి జోరు.. వైసీపీ బేజారు

జిల్లాలో మారిన రాజకీయ ముఖ చిత్రం


(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లకొకసారి జరిగే సాధారణ ఎన్నికలు 2024లో రావడంతో జిల్లా రాజకీయ ముఖచిత్రంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పటివరకూ అధికారంలో ఉన్న వైసీపీ ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని దుస్థితికి చేరగా, విపక్ష పార్టీలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడి అనూహ్య విజయాన్ని సాధించి అధికార పగ్గాలు చేపట్టాయి. జిల్లాలో వైసీపీకి ఒక్క అసెంబ్లీ స్థానం కూడా దక్కకపోవడం గమనార్హం. ఎంపీ స్థానాన్ని కూటమి బలపరిచిన బీజేపీ తన ఖాతాలో వేసుకుంది. ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పినట్టయింది.

- అన్ని చోట్లా కూటమి విజయదుందుభి
- వైసీపీ నుంచి నేతల వలస బాట



సీఎం రమేశ్



అయ్యన్నపాత్రుడు



వంగలపూడి అనిత

ఓడలు బళ్లు... బళ్లు ఓడలు

ఉమ్మడి విశాఖ జిల్లాగా ఉన్నప్పుడు 2019లో జరిగిన ఎన్నికల్లో విశాఖపట్నం నగరంలోని నాలుగు (తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ) నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించగా, మిగిలిన 11 (భీమిలి, పెందుర్తి, గాజువాక, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, ఎలమంచిలి, పాయకరావుపేట, మాడుగుల, అరకు, పాడేరు) స్థానాలు, మూడు ఎంపీ స్థానాలను వైసీపీయే గెలుచుకుంది. అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లాలో అరకు, పాడేరు అసెంబ్లీ స్థానాలు, అరకు ఎంపీ స్థానాన్ని వైసీపీ దక్కించుకోగా, మిగతావి కూటమి పార్టీలు గెలుచుకున్నాయి.

కాలచక్రం 2024 పొలిటికల్

వైసీపీకి కోలుకోని దెబ్బ

గత ఐదేళ్లు అరాచక పాలన సాగించిన వైసీపీకి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారు. రెండేళ్ల క్రితం జిల్లాలను పునర్విభజన చేయడంతో జిల్లాలో ఒక ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలు మాత్రమే ఉన్నాయి. 2024లో జరిగిన ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి వైసీపీ నుంచి బూడి ముత్యాలునాయుడు పోటీ చేయగా, ఆయనపై కూటమి బలపరిచిన బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ విజయం సాధించారు. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి వైసీపీ నేత మలసాల భరత్‌కుమార్ బరిలో దిగగా, జనసేన నేత కొణతాల రామకృష్ణ గెలుపొందారు. పెందుర్తిలో అదీప్‌రాజ్(వైసీపీ)పై పంచకర్ల రమేశ్‌బాబు (జనసేన), చోడవరంలో కరణం ధర్మశ్రీ (వైసీపీ)పై కేఎస్ఎన్ఎస్ రాజు(టీడీపీ), మాడుగులలో ఈర్లె అనురాధ(వైసీపీ)పై బండారు సత్యనారాయణ మూర్తి(టీడీపీ), నర్సీపట్నంలో పెట్ల ఉమాశంకర్ గణేశ్(వైసీపీ)పై అయ్యన్న పాత్రుడు(టీడీపీ), ఎలమంచిలిలో కన్నబాబురాజు (వైసీపీ)పై ... మిగతా 8వ పేజీలో

శభాష్ నితీశ్

- ఆస్ట్రేలియాపై సెంచరీ కొట్టిన విశాఖ కుర్రాడు
- క్రీడాభిమానుల హర్షం



విశాఖపట్నం, స్పోర్ట్స్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖకు చెందిన యువ క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి శనివారం ఆసీస్ బౌలర్లను చెడుగుడు ఆడుకున్నాడు. మెల్‌బోర్న్‌లో జరుగుతున్న నాలుగో టెస్టులో అజేయ సెంచరీ (105 నాటౌట్)తో నిలిచాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్, పంత్, జడేజా వంటి స్టార్ ఆటగాళ్లు తక్కువ స్కోర్లకే పెవిలియన్ దారిపట్టిన దశలో బ్యాటింగ్‌కు దిగిన నితీశ్‌కుమార్‌రెడ్డి భారత స్కోరు బోర్డును ముందుకు నడిపించే బాధ్యతను తీసుకున్నాడు. మరో ఎండ్‌లో ఆడుతున్న వాషింగ్టన్ సుందర్ చక్కని సహకారం అందించడంతో ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతను అర్ధసెంచరీ పూర్తి చేసి (50)న తరువాత అవుటవ్వడంతో నితీశ్ కాస్త జోరు తగ్గించాడు. అయితే వ్యక్తిగత స్కోరు 99 పరుగుల వద్ద బోలండ్ బౌలింగ్‌లో మిడాన్ మీదుగా బౌండరీ బాది టెస్టు కెరీర్‌లో తొలి సెంచరీ సాధించాడు. నితీశ్‌కుమార్‌రెడ్డి సెంచరీ చేయడంతో స్టేడియంలో భారత్ క్రీడాభిమానుల గ్యాలరీ స్టాండ్ కేరింతలు, చప్పట్లతో దద్దరిల్లింది.

సిరీస్‌లో అమోఘంగా రాణిస్తున్న నితీశ్‌కుమార్ రెడ్డి

ఈ సిరీస్‌లో నితీశ్‌కుమార్‌రెడ్డి అమోఘంగా రాణిస్తున్నాడు. కెరీర్‌లో తొలి టెస్ట్ సిరీస్‌లో అద్భుతమైన బ్యాటింగ్‌తో ప్రపంచ దిగ్గజ క్రికెటర్ల ప్రశంసలు అందుకుంటున్నాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 41, రెండో ఇన్నింగ్స్‌లో 38 (నాటౌట్) పరుగులో రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర వహించాడు. ఆడిలైట్‌లో జరిగిన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేశాడు.

నర్సరీల్లో ఔషధ మొక్కల పెంపకం

- అటవీ శాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రాహుల్ పాండే



నర్సరీని పరిశీలిస్తున్న రాహుల్ పాండే

కె.కోటపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నర్సరీల్లో ఔషధ మొక్కలను పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని అటవీ శాఖ అడిషనల్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ రాహుల్ పాండే అన్నారు. శని వారం మండలంలోని సింగందొరపాలెం శివారు కొత్తూరు అగ్రహారంలో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. వచ్చే ఏడాది మార్చినాటికి ప్రతి నర్సరీలో ఔషధ మొక్కలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇక్కడ నర్సరీలు బాగున్నాయని, వివిధ జాతుల మొక్కలను ఉచితంగా తీసుకు వెళ్లి పొలాలు, స్కూళ్ల ఆవరణల్లో నాటు కోవచ్చునన్నారు. అలాగే మండలంలోని బత్తివానిపాలెం నర్సరీని కూడా పరిశీలించారు. ఆయన వెంట జిల్లా సోషల్ ఫారెస్ట్ (డీఎఫ్ఓ) జి.లక్ష్మణ్, అనకాపల్లి ఫారెస్ట్ రేంజర్ అధికారి చంద్రశేఖర్, అడిషనల్ ఫారెస్ట్ రేంజర్ అధికారి నూకరాజు, సిబ్బంది ఉన్నారు.

నియోజకవర్గంలో లక్ష ఉద్యోగాలు

- పెద్ద సంఖ్యలో కంపెనీలు రానున్నాయి
- మరో మూడు నెలల్లో మరోసారి మెగా జాబ్‌మేళా
- త్వరలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- హోం మంత్రి వంగలపూడి అనిత



కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

పాయకరావుపేట, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో కంపెనీలు వస్తున్నందున, రానున్న రోజుల్లో నియోజకవర్గంలో సుమారు లక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన సంస్థ సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాను హోం మంత్రి అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సుమారు రెండు వేల మందికి ఉద్యోగాలు వస్తాయని ఏర్పాటుచేసిన ఈ జాబ్‌మేళాలో 50 కంపెనీలు పైగా పాల్గొంటున్నందున ప్రతి ఒక్కరికి ఉద్యోగం వస్తుందని భావిస్తున్నానన్నారు. ఒకవేళ రాకుంటే నిరాశ పడవద్దని, మరో మూడు నెలల్లో మరో మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో నియోజకవర్గానికి ఒక్క కంపెనీ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పుడు పెద్ద సంఖ్యలో కంపెనీలు తరలి వస్తున్నాయన్నారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ రాబోతోందని, అదే విధంగా నియోజకవర్గం ఇండస్ట్రియల్ హబ్‌గా మారబోతోందని, కేంద్రం నిధులు సుమారు వెయ్యి కోట్లతో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటవుతున్నందున సుమారు వంద కంపెనీలు వచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయన్నారు. దీంతో రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో సుమారు లక్ష మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు లభించేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, జాబ్స్ జిల్లా మేనేజర్ కళ్యాణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు, శ్రీప్రకాశ్ ... మిగతా 8వ పేజీలో

జూనియర్ కళాశాల కల నెరవేరేనా?

ఏపీ రెసిడెన్సియల్ స్కూల్‌ను జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేస్తూ 2019లో ప్రతిపాదనలు

- అయ్యన్నపాత్రుడు చొరవతో ప్రభుత్వానికి నివేదిక
- గత వైసీపీ పాలనలో పట్టించుకోని వైనం
- ప్రైవేటు సంస్థల్లో చదివించాలంటే ఫీజులు ఎక్కువ అని విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన
- కూటమి ప్రభుత్వంలో అప్‌గ్రేడ్ అవుతుందని ఆశాభావం

నర్సీపట్నం, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): **గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం గురుకుల విద్యార్థులకు శాపంగా మారింది. గురుకుల పాఠశాలను జూనియర్ కళాశాల చేయాలని అయ్యన్నపాత్రుడు పెట్టిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. కాగా కూటమి ప్రభుత్వం హయాంలో ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్ అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.**



పెదబొడ్డేపల్లిలోని ఏపీ రెసిడెన్సియల్ స్కూల్

అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో 1983లో నర్సీపట్నం ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ (బాలురు)ను మంజూరు చేశారు. అయ్యన్నపాత్రుడు చొరవతో పెదబొడ్డేపల్లిలో మెయిన్ రోడ్డును ఆనుకొని 15 ఎకరాల విస్తీర్ణంలో ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ ఏర్పాటైంది. దీంతో పేద విద్యార్థులకు ఐదు నుంచి పదవ తరగతి వరకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రతీ ఏటా ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లు భర్తీ చేస్తారు. ప్రస్తుతం ఇక్కడ 5 నుంచి 10వ తరగతి వరకు 465 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాణ్యమైన విద్యా బోధన కారణంగా ఇక్కడ చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు, ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాలలో దేశ, విదేశాలలో స్థిరపడ్డారు. ఇక్కడ పదవ తరగతి పూర్తి చేసిన తరువాత విద్యార్థులు ఇంటర్మీడియట్ ... మిగతా 8వ పేజీలో

జోరందుకున్న వరి కోతలు

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ

అనకాపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): **ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో రైతులు వరి కోతల పనుల్లో బిజీగా ఉన్నారు. అల్పపీడనం ప్రభావంతో గత కొద్ది రోజులుగా నెలకొన్న ప్రతికూల వాతావరణంతో రైతులు వరి కోతల పనులు వాయిదా వేసుకున్న విషయం తెలిసిందే. అయితే మూడు రోజులుగా పొడి వాతావరణం నెలకొనడంతో రైతులు తిరిగి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.**



మునగపాకలో వరి కుప్పలు వేస్తున్న రైతులు

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వరి కోతలు జోరందుకున్నాయి. కొందరు రైతులు ఇప్పటికే కోసిన వరి కంకులను కుప్పలు వేసుకొని, నూర్పిడి పనులకు సిద్ధమవుతున్నారు. జిల్లా వ్యవసాయాధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1.40 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. రెండు రోజులుగా వాతావరణం పొడిగా ఉండడంతో జిల్లాలో 80 వేల ఎకరాలకు పైగా వరి కోతలు పూర్తయినట్టు చెబుతున్నారు. అనకాపల్లి, మునగపాక, చోడవరం, చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, రోలుగుంట, రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో ఇప్పటికే వరి కోతలు 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. రైతులు వరి కుప్పలు వేసుకొని నూర్పిడి పనులకు సిద్ధమవుతున్నారు. రాంబిల్లి, ఎలమంచిలి, ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో వరి కోతలు ఇప్పుడిప్పుడే వేగం పుంజుకున్నాయి. జిల్లాలో మరో వారం రోజుల పాటు వాతావరణం ఇదే విధంగా కొనసాగితే, కోతలతో పాటు నూర్పిడి పనులు పూర్తవుతాయని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు.

సబ్ జైలును సందర్శించిన
జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారిణి


సబ్ జైలు సిబ్బందితో సమావేశమైన అధికారిణి శేషమ్మ

ఎలమంచిలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారిణి ఎం.వి.శేషమ్మ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. జైలు పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నిందితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.నూకరాజు, న్యాయవాది పి.వి.రమణ, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాఘవేంద్రరావు

రాంబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎలమంచిలి జూనియర్ డివిజన్ అడిషనల్ సివిల్ జడ్జి టి.రాఘవేంద్రరావు అన్నారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. సమాజంలో మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వీటి నుంచి రక్షణ పొందేందుకు చట్టాలు ఎంతో దోహదపడతాయన్నారు. చిన్నచిన్న తగాదాలను గ్రామస్థాయిలో పరిష్కరించుకోవాలని, సమస్య తీవ్రంగా ఉంటే న్యాయ సలహాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఐ నర్సింగరావు ఎలమంచిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి. నూకరాజు, ఏజీబీ డి.వెంకటేశ్వర్లు, న్యాయవాది టి.నూకరాజు, ఐసీడీఎస్ పీవో కె.ఇందిరాదేవిలు గృహ హింస, వరకట్న వేధింపులు, నైతిక వేధింపులు తదితర అంశాలను న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. ఎంపీడీవో జయ మాధవి, ఎస్ఐ నాగేంద్ర, ఈవోపీఆర్డీ రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు ప్రొవైడర్ల ఎంపికకు దరఖాస్తులు స్వీకరణ

ఎలమంచిలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో సర్వీసు ప్రొవైడర్ల ఎంపికకు దరఖాస్తులు స్వీకరిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) సీఎంఎం డి.పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, బ్యూటీషియన్ తదితర సేవలందించే పురుషులు, మహిళలు దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇచ్చి, హోమ్ ట్రయాంగిల్ యాప్ ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్ ద్వారా వీరిని ఆన్‌బోర్డు చేసి తద్వారా జీవనోపాధి కల్పించడం జరుగుతుందని వివరించారు. ఔత్సాహికులు ఈ నెల 30నుంచి జనవరి మూడవ తేదీ వరకు ఇక్కడి మెప్మా కార్యాలయంలో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వీసు ప్రొవైడర్ల రిజస్ట్రేషన్ మేళా జనవరి నాలుగో తేదీన నిర్వహించడం జరుగుతుందని వివరించారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాస్‌పుస్తకం, విద్యార్హత ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలతో మెప్మా కార్యాలయంలో సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

సమయపాలన పాటించకుంటే జీతాలు కట్

- సచివాలయ సిబ్బందికి డీపీవో శిరీషారాణి హెచ్చరిక
- గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటలకే కార్యదర్శులు ఉండాలని ఆదేశం


మండల కార్యాలయంలో ఫిర్యాదులపై వివరణ కోరుతున్న డీపీవో శిరీషారాణి

అచ్యుతాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందికి జీతాలు నిలుపుదల చేస్తామని నియోజకవర్గం ప్రత్యేకాధికారిణి, డీపీవో శిరీషా రాణి హెచ్చరించారు. ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఉదయం ఎనిమిది గంటలకే గ్రామాల్లో ఉండాలన్నారు. పారిశుద్ధ్యంపై అంతా ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మండలంలో 26 సంపద కేంద్రాలు ఉండగా, 17 మాత్రమే పనిచేస్తున్నాయని, మిగిలిన వాటిని కూడా అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకుంటే పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి లభిస్తుందన్నారు. అలాగే, ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, ఎంపీడీవో ప్రభాకరరావు, తహసీల్దార్ జీవీ జనార్థన్, సీఐ నమ్మి గణేష్, ఈవోపీఆర్డీ శ్రీరామనాయుడు,పలువురు అధికారులు పాల్గొన్నారు.

నలుగురికి ప్రత్యేక క్లాస్

నలుగురు కార్యదర్శులకు డీపీవో ప్రత్యేక క్లాస్ తీసుకున్నారు. 'పైసలిస్తేగాని కార్యదర్శులు పనిచేయడం లేదు' అని ఈ నెల 26న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆరోపించడం, పత్రికల్లో ప్రచురితం కావడంతో ఆమె అచ్యుతాపురం, వెదురువాడ, మోసయ్యపేట, రామన్నపాలెం కార్యదర్శులను ఆమె హెచ్చరించారు. పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎలమంచిలి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో శనివారం స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా మునిసిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, స్థానిక నేతలు కలిసి తుప్పలను తొలగించారు. తొలుత అధికారులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు అంతా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు మరిణేశ్వరరావు, మజ్జి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి అన్నారు. వెల్చూరు పంచాయతీ సంతపాలెంలో స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. ఈవోపీఆర్డీ రాజు, గ్రామ నాయకులు కె.చినబాబు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్ర గొల్లలపాలెంలో రోడ్డు పనులు ప్రారంభం

అచ్యుతాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వెదురువాడ పంచాయతీ శివారు ఎర్రగొల్లలపాలెం వాసులకు ఎట్టకేలకు సీసీ రోడ్డు సౌకర్యం కలగనుంది. ఇటీవల మంజూరైన నిధులతో పనులను చేపట్టనున్నారు. వెదురువాడ సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. కొయ్య మహాలక్ష్మి నాయుడు, శ్రీనివాసరావు, రాజేష్ వర్మ, బాబూజీ, తాతారావు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా నాయుడుబాబు


నాయుడుబాబును అభినందిస్తున్న పార్టీ నాయకులు

అచ్యుతాపురం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ మండల అధ్యక్షుడిగా కూండ్రపు నాయుడుబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక్కడి పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా రిటర్నింగ్ అధికారి ధనలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఎన్నిక నిర్వహించారు. రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన నాయుడు బాబు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తానన్నారు. ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, కిసాన్ మోర్చ జోనల్ ఇన్‌చార్జి గొంతిన భక్తసాయిరాం, రాష్ట్ర సైనిక సెల్ కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు జేవీఎస్ రాజు, కొరుప్రోలు చిన్నారావు, రాజానరాజు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక మండల అధ్యక్షుడిగా కాళేశ్వరరావు

మునగపాక : బీజేపీ మండల అధ్యక్షుడిగా మళ్ల కాళేశ్వరరావు ఎన్నికయ్యారు. శనివారం ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పార్టీని గ్రామగ్రామాన అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం ఆయనను నాయకులు, కార్యకర్తలు అభినందించారు.


నియామక ఉత్తర్వులు అందుకుంటున్న కాళేశ్వరరావు

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అర్జీల వెల్లువ

- తహసీల్దార్ల వద్ద పలు గ్రామాల ప్రజలు మొర


పూడిమడక రెవెన్యూ సదస్సులో అర్జీని అందిస్తున్న అప్పారావు

అచ్యుతాపురం, డిసెంబరు 28 : మండలంలోని పూడిమడకలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జనార్ధన్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. అనంతరం ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పూడిమడక సర్వే నంబర్లు 26/1,2,3బి,4, 27/1,2, 28/1,2 30/2, 98/3,4, 99/1,2,3 లలో గల సుమారు 33 ఎకరాల భూమికి సంబంధించి విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని పూడిమడక మాజీ ఉప సర్పంచ్ చోడిపల్లి అప్పారావు, వాసుపల్లి శ్రీనివాసరావు విన్నవించారు. అలాగే మండలంలో అతిపెద్ద పంచాయతీ అయిన పూడిమడకను రెండు (పూడిమడక, కడపాలెం) పంచాయతీలుగా విడదీయాలని కోరారు. పూడిమడకలో కొన్ని భూములకు 2017లో 4 (1) నోటీసులిచ్చి ఇంతవరకు భూమి తీసుకోలేదని, పరిహారం ఇవ్వలేదని అందువల్ల ఈ భూముల్ని 4(1) నుంచి తొలగించి రైతులకు అప్పగించాలని మేరుగు రాజుబాబు విన్నవించారు. పూడిమడక శివారు కడపాలెం వద్ద గల మెరైన్ పోలీస్ స్టేషన్ పక్కన గల 80 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు నాయకులు ఆక్రమించుకున్నారని, వీటిని తొలగించి మత్స్యకారులకు ఇవ్వాలని మత్స్యకార్మికుల సంఘ నాయకుడు చేపల తాతలు కోరారు. అలాగే, మరిన్ని సమస్యలపై వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమాలో రెవెన్యూ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

కృష్ణంపాలెంలో మిగులు గ్రామాన్ని తరలించండి

రాంబిల్లి : మండలంలోని కృష్ణంపాలెం పంచాయతీలో మిగులు గ్రామాన్ని తరలించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు శనివారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ శ్రీనివాసరావుకు అర్జీని అందజేశారు. 2008లో ఏపీఐఐసీ కృష్ణంపాలెం పంచాయతీలో 80శాతం భూసేకరణ చేసి ఆయా కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చిందన్నారు. మిగతా 20 శాతం కుటుంబాలవారు గ్రామంలో ఉంటున్నారని, గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఎస్ఈజెడ్‌లోని పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వలన తామంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఇరవై శాతం ఉన్న ఈ మిగులు గ్రామానికి నోటిఫికేషన్ జారీచేసి ప్యాకేజీ ఇచ్చి తరలించాలని పేర్కొన్నారు. అనంతరం మరింత మంది తమ అర్జీలను అందజేశారు. అంతకుముందు తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణంపాలెం ఉప సర్పంచ్ పెదపాటి భుజంగరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు బైలపూడి సన్యాసినాయుడు, ముమ్మిడివరపు రాము, పెదపాటి నరసింహారావు, పట్నాల నారాయణరావు, నామాల రాము తదితరులు పాల్గొన్నారు.


కృష్ణంపాలెంలో సమస్యపై అర్జీని అందిస్తున్న గ్రామస్థులు

ఘనంగా లక్ష్మీ వల్లభుడు తిరువీధి


గరుడ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ

నక్కపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారి తిరువీధి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందరంగా గరుడ వాహనంపై లక్ష్మీ వల్లభుడు భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం గరుడ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారు, పల్లకీలో గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాఢవీధుల్లో ఊరేగించారు. గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద తిరుప్పావై పాశుర విన్నపం చేశారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారాలు


టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఉప విద్యాశాఖాధికారి, హెటెరో ప్రతినిధులు

నక్కపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి) మండలంలోని పలు హైస్కూళ్లలో 2023-24లో టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు శనివారం హెటెరో యాజమాన్యం తరపున నగదు పురస్కారాలు అందజేశారు. సుమారు 40 మందికి మొదటి బహుమతిగా రూ. 10వేలు, రెండో బహుమతిగా రూ. 7500లు, మూడవ బహుమతిగా రూ. 5000 చొప్పున ఒక్కో విద్యార్థికి స్థానిక హైస్కూల్‌లో అందజేశారు. దాదాపుగా రూ. 8 లక్షల ప్రోత్సాహకాలను అందించారు. అనంతరం మండలంలోని పలు పాఠశాలల్లో చదువుకుంటున్న టెన్త్ విద్యార్థులు 1200 మందికి రూ.4 లక్షల విలువైన స్టడీ మెటీరియల్‌ను జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు ఆధ్వర్యంలో ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెటెరో ప్రతినిధులు ఎస్.కుల్లారెడ్డి, ఎన్.సుధాకర్, ఎం.సుబ్బారెడ్డి, ఎస్.రాజారెడ్డి, ఎంఎస్ వీరవెంకట సత్యనారాయణరెడ్డి, సీఎస్ఆర్ టీం ప్రతినిధి సీహెచ్ అరుణకుమార్ రెడ్డి,సీహెచ్.శ్రీనివాస్, హెచ్ఎం రాణీలలిత పాల్గొన్నారు.

మండల లెవెల్ కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం


సమావేశంలో ప్రతినిధులు

ఎస్. రాయవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మం డల ప్రత్యేక అధికారిణి మనోరమ ఆధ్వర్యంలో మండల లెవెల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ రమేశ్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్ఐ విభీషణరావుతో కూడిన ఈ కమిటీ ప్రజా సమస్య పరిష్కార వేదిక ద్వారా వచ్చిన సివిల్ తగాదాల పరిష్కారానికి కృషి చేయనుంది. ప్రతీ శనివారం ఈ సమావేశంలో ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు.

గురుకులాల్లో సమస్యలుంటే చెప్పండి

- హోం మంత్రి అనిత


బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న హోం మంత్రి అనిత

నక్కపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో సమస్యలుంటే తన దృష్టికి తేవాలని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని శనివారం మధ్యాహ్నం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలోనే బాలికలు భోజనం చేస్తుండడంతో వారితో పాటు మంత్రి నేలపై కూర్చొని రుచి చూశారు. వంటశాలను, ఆహార పదార్థాలను ఆమె పరిశీలించారు. పిల్లలకు ప్రతీ రోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, అన్నంతో కూరలు కూడా సరిపడా వేయాలని సూచించారు. రోజూ భోజనం బాగానే పెడుతున్నారని ఈ సందర్భంగా పిల్లలు చెప్పారు. అనంతరం గురుకులం ఉపాధ్యాయులు లేకుండా బాలికలతో హోం మంత్రి ఏకాంతంగా మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలికలకు చదువు ఎంత ముఖ్యమో, రక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. ఉన్నతంగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. గురుకులంలో డార్మిటరీలు, మినరల్ వాటర్‌ప్లాంట్‌ను హోం మంత్రి పరిశీలించారు. పిల్లలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సువర్ణకుమారి, టీడీపీ నక్కపల్లి, ఎస్.రాయవరం మండలశాఖల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంటి అబద్ధం, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, మీగడ సత్తిబాబు, బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు కోసూరి శ్రీను తదితరులున్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి



పాయకరావుపేటలో మన్మోహన్‌సింగ్‌కు కాంగ్రెస్ నాయకుల నివాళి

పాయకరావుపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పదేళ్లపాటు ప్రధానిగా మన్మోహన్‌సింగ్ దేశ ఆర్థికాభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా విశిష్ట సేవలందించారని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో మన్మోహన్‌సింగ్ సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ , తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కర్రి హేమంత్ పాల్గొన్నారు.

కోటవురట్ల: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి నేపథ్యంలో శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదాపడింది. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు ఆదేశాల మేరకు ఎంపీడీవో కాశీవిశ్వనాథం ఈ సమావేశాన్ని వాయిదా వేశారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులుమన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వైస్ఎంపీపీ,సీతా బాబు, ఎంపీటీసీ సభ్యుడు పి. సూర్యారావు, ఎంఈవో జోషి పాల్గొన్నారు.

'టెన్త్‌లో చక్కటి ఫలితాలు సాధించాలి'


మంగవరంలో విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రతినిధులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం, గుంటపల్లి, ఉన్నత పాఠశాలలను శనివారం మండల పర్యవేక్షణ కమిటీ సందర్శించింది. పదో తరగతి పరీక్షలకు విద్యార్థుల సంసిద్ధత, ఏపీఎస్ సీఈఆర్టీ రూపకల్పన చేసిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా డీఈవో అప్పారావు నాయుడు ఆదేశాల మేరకు ఎంఈవోలు కె.ఎన్. గాంధీ, జి.రమేష్, ఇద్దరు ఉన్నత పాఠశాలల సీనియర్ ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ శనివారం మంగవరం, గుంటపల్లి, పట్టణంలోని కొత్త హరిజనవాడ, బాలికోన్నత పాఠశాలలను సందర్శించింది. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం, సెలవు దినాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. పరీక్షలలో మంచి మార్కులు సాధించడానికి పలు సూచనలు, సలహాలను అం దించారు. వివిధ సబ్జెక్టుల ప్రశ్న పత్రాల బ్లూ ప్రింట్ పై అవగాహన కలిగించారు.

ఇలా ఉంటే వ్యాధులు రావా?

- వాడనర్సాపురంలో పారిశుధ్య లోపం
- పేరుకున్న చెత్తాచెదారాలు


రహదారిపై వాడుక నీరు


గ్రామంలోని ఇళ్ల మధ్య మురుగు కాలువ

రాంబిల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార గ్రామమైన వాడనర్సాపురంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా ఇళ్ల మధ్య ఉన్న మురుగునీటి కాలువలో నీరు నిలిచి నాచుపట్టి దుర్వాసన వెదజల్లుతోంది. సుమారు 5 వేలకు పైగా జనాభా కలిగిన గ్రామంలో ఏళ్ల తరబడి ఈ సమస్య గ్రామస్థులను వేధిస్తోంది. దీంతోపాటు వీధుల్లో చెత్తాచెదారాలు పేరుకుపోయి కంపుకొడుతున్నాయి. గ్రామం మధ్యలోని కాలువలో స్థానికులు ఇళ్లలోని చెత్తను వేస్తుండటంతో మరింత దారుణ పరిస్థితి నెలకొంటోంది. కాలువల్లో పందులు పొర్లుతున్నాయి. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నట్టు స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.పంచాయతీ సిబ్బంది తూతూ మంత్రంగా పారిశుద్య పనులు చేపడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదని గ్రామ మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

చేపల వలకు చిక్కిన కొండచిలువ


పెదఉప్పలంలో హతమార్చిన కొండచిలువ

ఎస్. రాయవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి పెద ఉప్పలం గ్రామంలోని ఓ చెరువులో చేపల కోసమని వేసిన వలకు దా దాపు తొమ్మిదడుగుల కొండ చిలువ చిక్కింది. గ్రామానికి చెందిన సూర్యనారాయణ శనివారం చేపల కోసం వలను చెరువులో విసిరారు. కొంతసేపటికి వల బయటకు తీస్తున్న సమయంలో కాస్తా బరువుగా ఉండటంతో చేపలు పడినట్టు భావించి సూర్యనారాయణ సంతోషించారు. తీరా వలను తీసి చూసేసరికి వలలో కొండచిలువ చిక్కుకొని దర్శనమిచ్చింది. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వచ్చి దీనిని హతమార్చారు. గ్రామస్థులు దీనిని చూసేందుకు ఆసక్తి చూపారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు



మాట్లాడుతున్న తహసీల్దారు సత్యనారాయణ

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దారు జి. సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పి.ఎల్.పురం గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు.గ్రామ స్థాయిలో ఉన్న భూ వివాదాలు, ఆక్రమణలు, 22ఎ తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సదస్సులో మూడు దరఖాస్తులను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, సర్పంచి పి.దివాణం, వీఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్ క్యాలండర్ ఆవిష్కరణ

పాయకరావుపేట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా జయంతి సందర్భంగా శనివారం పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యా సంస్థల వార్షిక క్యాలెండర్ - 2025ను హోం మంత్రి వంగలపూడి అనిత విడుదల చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ టాటా కుటుంబం ఆదునిక భారతదేశానికి నిజమైన నిర్మాతలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్, డీఆర్‌డీఏ పీడీ సచీదేవి, జాబ్ జిల్లా మేనేజరు ఎం.కళ్యాణి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సమావేశానికి రావద్దు

» గత సభ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించుకుని రావాలి

» సబ్బవరం మండల సమావేశంలో అధికారులకు ఎమ్మెల్యే సూచన



సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి మొక్కుబడిగా రావద్దని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అధికారులకు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి అధ్యక్షతన శనివారం జరిగిన మండల సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ముందు సమావేశంలో చర్చించిన సమస్యలను వచ్చే సమావేశంలోగా పరిష్కరించుకోవాలన్నారు. ఎంపీపీ సూర్య కుమారి మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం అయ్యేలా, అభివృద్ధి పనులకు గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. పాతరోడ్డు- గుల్లేపల్లి రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మం జూరు చేయాలన్నారు. అనంతరం సభ్యులు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. అయ్యన్నపాలెం, కిల్లివానిపాలెం శ్మశానవాటికలకు ఉపాధి పథకంలో రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ బుదిరెడ్ల శ్రీలక్ష్మి కోరారు. అసకపల్లిలో పాడైన కల్వర్టులకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ కర్రి నర్సింగరావు విజ్ఞప్తి చేశారు. ఆదిరెడ్డిపాలెం శ్మశాన వాటికలో షెడ్డుకు నిధులు మంజూరు చేయాలని ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు కోరారు. అసంపూర్తిగా ఉన్న నారపాడు పీహెచ్‌సీ, ఆర్‌బీకే భవనాలకు నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ మామిడి శంకరరావు కోరారు. అమృతపురంలో నిర్వహించిన ఉపాధి పనుల్లో సుమారు రూ.1.5 లక్షల నిధులు దుర్వినియోగం జరిగిందని ఎంపీటీసీ సింగంపల్లి శ్రీను సభదృష్టికి తీసుకొచ్చారు.

గొర్లివాని పాలెం కారిచెరువు ఆయకట్టు రైతులు తమ ఉత్పత్తులు కల్లాలకు తెచ్చుకు నేందుకు మెటల్ రోడ్డు మంజూరు చేయాలని ఎంపీటీసీ గొర్లి చైతన్య విన్నవించారు. పైడివాడ, పైడి వాడఅగ్రహారంలో ఎన్టీఆర్ గృహాలకు విద్యుత్ మీటర్లు, ఇంటి పన్నులు వేసేలా అధికారులను ఆదేశించాలని ఎంపీటీసీ శీరం అప్పలరాజు కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలం ఆక్రమణలకు గురైందని పలువురు ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. టెక్కలిపాలెంలో ఫ్లోరైడ్ సమస్య ఉందని, పరిష్కారానికి కృషి చేయాలని సర్పంచ్ కోరారు. తుఫాన్ల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, సర్వే చేసి నష్టపరిహారం ఇప్పించాలని పలువురు ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కోరారు. అసకపల్లి- లంకెలపాలెం రోడ్డు బాగు చేయాలని ఎంపీటీసీ కర్రి అప్పారావు కోరగా, నిధులు ఇచ్చినా ఎందుకు పనులు ప్రారంభించలేదని జేఈ బాలరాజుపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. మండలంలో అక్రమ క్వారీ, బెల్టుషాపులు ఏర్పాటు చేయడంపై సభ దృష్టికి పలువురు తీసుకు వచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రావెల్ అక్రమంగా తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే తానే స్వయంగా చర్యలకు దిగాల్సి వస్తుందని మైన్స్, పోలీస్, రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల భవనాల నిర్మాణానికి స్థలాలు మంజూరు చేసేలా రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సీడీపీవో లలితకుమారి ఎమ్మెల్యేను కోరగా, వారం రోజుల్లో స్థలాలు కేటాయించాలని డీపీ అప్పారావుకు సూచించారు. ఎంపీడీవో పి.పద్మజ, వైస్ ఎంపీపీలు ఝాన్సీలక్ష్మీరాణి, చొక్కాకుల గోవింద, ఏవో శివరామ ప్రసాద్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, తొలుత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు.

రైతులకు పంట నష్టపరిహారం అందించాలని వినతి



వ్యవసాయ శాఖాధికారిణికి వినతిని అందిస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం చెల్లించాలని రైతు సంఘాల నాయకులు జిల్లా వ్యవసాయాధికారిణి వసంతకుమారిని కోరారు. ఈ మేరకు వినతి పత్రాలను అందజేశారు. అచ్యుతాపురం, రాంబిల్లి, చోడవరం, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో వర్షానికి దెబ్బతిన్న వరి పొలాలను పరిశీలించామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు తెలిపారు. వర్షాలకు ముందు కోసిన వరి పనలు తడిసిపోవడంతో మొలకలు వస్తున్నాయన్నారు. కొందరు మడుల్లోనే కుప్పలు వేయడం వల్ల వరి పనులు ముక్కిపోయే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందించడంతో పాటు తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు కర్రి అప్పారావు, జి.నాయనబాబు, డి.వెంకన్న, కె.సదాశివ రావు, ఎస్‌వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో మేలు కొలుపు

పరవాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసం సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, లంకెలపాలెం, వెన్నెలపాలెం గ్రామాల్లో మేలు కొలుపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని రామాలయాల వద్ద నుంచి శనివారం తెల్లవారు జామున ఐదు గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. నగర సంకీర్తనలతో పాటు భజనలు, భక్తి గీతాలను ఆలపించారు. భోగి పండుగ వరకు ప్రతి రోజూ ఉదయం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య

» హైదరాబాద్ వాసిగా గుర్తింపు

» సుజాతనగర్‌లో అఘాయిత్యానికి కారణాలపై పోలీసుల ఆరా

» ఐటీ ఉద్యోగిగా గుర్తింపు కార్డు లభ్యం



మృతిచెందిన శ్రీకాంత్ (ఫైల్)

పెందుర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో హైదరాబాద్‌కు చెం దిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుజాతనగర్‌లో అపార్ట్‌మెంట్‌లో కొన్ని ఫ్లాట్ల పనులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం వాచ్‌మన్ అన్ని ఫ్లాట్లను పరిశీలించాడు. ఐదో అంతస్తులో తలుపులు బిగించని ఓ ఫ్లాట్ బాత్‌రూమ్‌లో గల షవర్‌కు తాడుతో ఉరేసుకుని ఉన్న యువకుడి మృతదేహం కనిపించింది. దీంతో వాచ్‌మన్ ఆందోళన చెంది పెందుర్తి పోలీసులకు సమాచారమిచ్చాడు. సీఐ సతీశ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుడి మృతిపై అనుమానాలు వ్యక్తంకావడంతో మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాత్‌రూమ్‌లో గల షవర్‌కు నైలాన్ తాడు కట్టి మెడకు బిగించుకుని, రెండు మోకాళ్ల కిందికి వేలాడుతూ ఉన్న స్థితిలో మృతదేహం కనిపించింది చేతి మణికట్టు కోసుకున్నట్లు గాయం ఉంది. సమీపంలో ఆధారాల కోసం వెదకగా బ్యాగు కనిపించింది. అందులో ఆధార్, పాన్ కార్డు తాడు, కత్తెర, సెల్‌ఫోన్ పోలీసులకు లభ్యమయ్యాయి. ఆధార్ కార్డులో ఉన్న వివరాల ఆధారంగా మృతుడు పి.వి. శ్రీకాంత్, వయస్సు 27 సంవత్సరాలు, హైదరాబాద్ అని ఉంది. ఇతను ఓ ప్రముఖ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని ఐడీ కార్డు ద్వారా తెలిసింది. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు మృతుడివేనా? అన్న నిర్ధారణ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి ఆత్మహత్యగా పోలీసులు భావిస్తున్నారు. తాను చనిపోతున్నట్లు రెండు రోజుల కిందటే కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేశాడని పోలీసులు అంటున్నారు. హైదరాబాద్ నుంచి సుజాతనగర్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకోవడానికి కారణలు తెలియాల్సి ఉంది. క్లూస్ టీం, జాగిలాన్ని రప్పించి పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రాథమికంగా ఆత్మహత్యగా భావిస్తున్నామని ఇందులో వేరే కోణం ఏదైనా ఉందా? అన్నది దర్యాప్తులో తెలుస్తుందని సీఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

జగన్ అవినీతి వల్లే పెరిగిన విద్యుత్ చార్జీలు

» వైసీపీ పాలనలో ఇష్టారాజ్యం » సెకీ ఒప్పందంతో రూ.1500 కోట్లు దోచేశారు » టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

తుమ్మపాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జగన్‌రెడ్డి అవినీతి వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయని గృహ నిర్మాణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆరోపించారు. శనివారం అనకాపల్లిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెకీ ఒప్పందంతో జగన్‌రెడ్డి రూ.1500 కోట్లు దోచేశారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచేందుకు నాడు అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపాదనలు పంపిన జగన్‌రెడ్డి, నేడు ధర్నాలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుండడంతో అది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులంతా దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు మారిశెట్టి శంకర్రావు, కొణతాల కారుబాబు తదితరులు పాల్గొన్నారు.

సీఎం హోదాలో 39 శాఖలలో జగన్ అవినీతి : బుద్ధ

ఇదిలావుంటే, ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఏర్పాటైన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.1.3 లక్షల కోట్లు భారాన్ని ప్రజలపై మోపిన ఘనత జగన్‌రెడ్డిదేనని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో 39 శాఖలలో అవినీతికి పాల్పడి కోట్లాది రూపాయలు ప్రజాధనాన్ని జగన్‌రెడ్డి దోచుకున్నారని ఆరోపించారు. 2022-24 మధ్య కాలంలో విద్యుత్ వాడకానికి సంబంధించి కరెంటు చార్జీలు పెంచాలని వైసీపీ ప్రభుత్వం విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు ప్రతిపాదనను పంపి ఆమోదం తీసుకుందని ఆయన వివరించారు. దీని వల్లే ప్రస్తుతం పెరిగిన విద్యుత్ చార్జీలు అమలులోకి వచ్చినట్టు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్

ముఠా కార్మికుల చర్చలు విఫలం

» కొనసాగుతున్న సమ్మె » తెరుచుకున్న నిత్యావసర దుకాణాలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన ముఠా కార్మికులు శనివారం కూడా తమ ఆందోళనను కొనసాగించారు. కార్మిక శాఖ కార్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన చర్చలు విఫలం కావడంతో సమ్మెను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లకు 50 శాతం పెంచాలని కార్మికులు డిమాండ్ చేసినప్పటికీ 35 శాతమైనా పెంచాలని కోరారు. అయితే వర్తకులు అందుకు అంగీకరించలేదు. కార్మికులకు న్యాయమైన కూలిరేట్లు పెంచాలని ముఠా కార్మిక సంఘం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఇదిలావుంటే, హోల్‌సేల్, రిటైల్ వర్తకులు శనివారం దుకాణాలను తెరిచారు. దీంతో కొనుగోలుదారులకు నిత్యావసర సరకులు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వాధికారుల ఆదేశాల మేరకు సామాన్య ప్రజలు నిత్యావసర సరకులకు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతోనే కిరాణా దుకాణాలన్నింటినీ శనివారం ఉదయం నుంచి తెరిపించామని వర్తకులు తెలిపారు. అలాగే హోల్‌సేల్ షాపులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన వివరించారు.

ప్రభుత్వం దృష్టికి మోటారు మెకానిక్‌ల సమస్యలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మోటారు సైకిల్ మెకానిక్ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటైన మోటారు సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, భోగలింగేశ్వర ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, యూనియన్ నాయకులు మారిశెట్టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



పీలా గోవింద్‌కు వినతిపత్రం అందిస్తున్న యూనియన్ ప్రతినిధులు

'అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు'



నెహ్రూచౌక్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సంఘ నేతలు

కొత్తూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై పార్లమెంటు సాక్షిగా అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని జైభీమ్ సేన సేవా సంఘం అధ్యక్షుడు రేబాక మధు అన్నారు. శనివారం అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా పొందిన ఒక బాధ్యతాయుత పదవిలో ఉన్న కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంటులో అంబేడ్కర్ అనే బదులుగా దేవుడి నామం స్మరిస్తే ఏడేడు జన్మల స్వర్గలోక ప్రాప్తి వచ్చేదని అనడం రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను అగౌరవపరచడమేనని పేర్కొన్నారు. అదే రాజ్యాంగం లేకుంటే ఏ స్థాయిలో ఉండేవారో ఆలోచించుకోవాలని హితవు పలికారు. తక్షణమే అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు, రిపబ్లిక్ అండ్ పార్టీ ఆఫ్ ఇండియా మాడుగుల ఇన్‌చార్జి మల్లవరపు లోవచందు, జిల్లా కార్యదర్శి బేలా శివగణేష్, ఎలమంచిలి మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్ పిల్లి అప్పారావు, కోటపాడు సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని తదితరులు పాల్గొన్నారు.

'లైసెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ప్రైవేటుపరం చేయొద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

పరవాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మోటార్ కార్మికులకు అవసరమైన లైసెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేటుపరం చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. లంకెలపాలెం ఆటో స్టాండ్ వద్ద శనివారం ఆటో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మోటార్ వెహికల్ చట్ట సవరణ చేసి మోటార్ కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తుందని మండిపడ్డారు. లైసెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేటుపరం చేయడం కార్మికులకు మరింత ఇబ్బందులకు గురిచేస్తుందని వాపోయారు. ఇప్పటికే విదేశీ యాప్‌ల వల్ల ఆటో కిరాయిలు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు చౌడువాడ నరసింగరావు, కె.వెంకటస్వామి, కరణం మహాలక్ష్మినాయుడు, శెట్టి గోవింద, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేద పండితుల భారత పరిక్రమ యాత్ర ప్రారంభం



యాత్రను ప్రారంభిస్తున్న సప్తరుషి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ మాధవశర్మ

సబ్బవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వేదాల ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పేందుకే వేద భారత పరిక్రమ యాత్రను నిర్వహిస్తున్నామని సప్తరుషి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు డాక్టర్ ఎం.మాధవశర్మ అన్నారు. మండలంలోని గొల్లలపాలెంలో గల సప్తరుషి ఆశ్రమం నుంచి వేదభారత పరిక్రమ యాత్రను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అద్భుతమైన హిందూ వేదసంస్కృతిని తిరిగి తీసుకు రావడంలో ఈ యాత్ర ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఈ యాత్రలో 25 మంది వేదపండితులు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ యాత్ర సాగిస్తారన్నారు. గ్రామాలు, పట్టణాలు, పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ వేద మంత్రోచ్చారణ చేస్తూ భారతదేశానికి శాంతి, సుభిక్షం, రక్షణ కలిగించే లక్ష్యంతో ఈ యాత్రను కొనసాగిస్తారన్నారు.

మళ్లవీధిలో రతన్‌టాటా జయంతి

అనకాపల్లి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మళ్లవీధిలో లాల్‌బహదూర్ శాస్త్రి యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో రతన్ టాటా ఎంతో మందికి సాయం అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సరిసా ధర్మా, యల్లపు రామారావు, దొడ్డి కృష్ణారావు, శ్రీను, గోవింద్, నాగేశ్వరరావు, రాజేంద్ర పాల్గొన్నారు.

'రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం'



ఉగ్గినపాలెంలో అర్జీ స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి

కశింకోట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అన్ని అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేస్తామని కశింకోట డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. ఉగ్గినపాలెం, కొత్తపల్లి బుచ్చెయ్యపేట గ్రామాల్లో శనివారం జరిగిన సదస్సుల్లో మాట్లాడారు. భూ సమస్యలు ఉన్నవారికి ఈ సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. మండల సర్వేయర్ రామారావు, సర్పంచ్ కలగ గున్నయ్యానాయుడు, వీఆర్వో శ్రీనివాసరావు, కూటమి నాయకులు కలగా గోవింద, శ్రీనివాసరావు, సోమేశ్వరరావు, ముసిలినాయుడు, గొంతిన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేష్ అన్నారు. మండలంలోని ఈ.బోనంగి పంచాయతీ బొద్దపువానిపాలెం, గొర్లివానిపాలెంలలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మాట్లాడారు. ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఈ సదస్సు ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. అనంతరం వివిధ సమస్యలపై 36 అర్జీలను సమర్పించారు. మండల సర్వేయర్ శ్రీనివాసరావు, సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు, నాయకులు బుగిడి రామగోవిందరావు, గొర్లి ఎరుకునాయుడు, వీఆర్వోలు శ్రీకాంత్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల వలన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ పేర్కొన్నారు. మండలంలోని గొల్లలపాలెం, విప్పాక అగ్రహారం గ్రామాల్లో జరిగిన సదస్సులో మాట్లాడారు. రైతులు పెట్టుకున్న అర్జీలన్నీ ఆన్‌లైన్ చేసి 45 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎల్. అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబు, సచివాలయ సిబ్బంది లోకేశ్, దినేష్, రాంబాబు, గ్రామ పెద్దలు బొండా రాజు తదితరులు పాల్గొన్నారు.



పరవాడ మండలం గొర్లివానిపాలెం అర్జీని అందుకుంటున్న రీసర్వే డీటీ



సబ్బవరం మండలం గొల్లలపాలెంలో తహసీల్దార్ చిన్నికృష్ణకు అర్జీ

వామనావతారంలో శ్రీవారు



అనకాపల్లి టౌన్/కశింకోట, డిసెంబరు 28 (ఆంధ్ర జ్యోతి) : ధనుర్మాసోత్సవాలు అనకాపల్లి గాంధీనగరం, కశింకోటలలో వైభవోపేతంగా జరుగుతున్నాయి. స్వామి వారిని మూడు రోజులకు ఓ అవతారంలో అలంకరిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం శ్రీవారు వామనావతారంలో దర్శనమిచ్చారు. గాంధీనగరంలో ఆలయ ప్రధానార్చకులు రేజేటి గోప అప్పలాచార్యులు, కశింకోట వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో రేజేటి శ్రీరామాచరణాచార్యులు, మారుతి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

నేడు గవర వన సమారాధన



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గవర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో ఆదివారం జరగనున్న వన సమారాధనను విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షురాలు పొలమరశెట్టి వాణి పిలుపునిచ్చారు. మార్కెట్‌యార్డులో ఏర్పాట్లను గవర మహిళా సంక్షేమ సమితి ప్రతినిధులు పరిశీలించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వనసమారాధన కార్యక్రమానికి జిల్లాలోని గవర సామాజికవర్గమంతా పెద్ద ఎత్తున హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల అరుణరాణి, దొడ్డి పార్వతీదేవి, మళ్ల గౌరీ, కాండ్రేగుల కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో మన్మోహన్‌సింగ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న రత్నాకర్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సభను ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జె.గణేశ్ ప్రసాద్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ కె.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'పోరు దీక్షను విజయవంతం చేయాలి'

తుమ్మపాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల ఫీజుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న పోరు దీక్షను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థుల ఫీజు రీయింబర్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. అలాగే జీవో నంబరు 77ను రద్దు చేస్తామని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు హరికృష్ణ, కుమార్, రుద్రి, జగదీష్, సింహాద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యువకుడు అదృశ్యమైన సంఘటనపై శుక్రవారం రాత్రి అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు శనివారం తెలిపారు. పట్టణానికి ఆనుకొని ఉన్న శారదానగర్‌కు చెందిన గొన్నాబత్తుల శ్యామ్ వెంకట్(22) ఒక ప్రైవేటు బ్యాంకులో తన తల్లి పేరున ఉన్న క్రెడిట్‌కార్డు ద్వారా రుణం పొంది చెల్లించలేదన్నారు. బ్యాంక్ ఏజెంట్ ఈ నెల 18వ తేదీన ఇంటికి వచ్చేసరికి తల్లి మంగ, తండ్రి గోవింద్‌లు బ్యాంకులో తీసుకున్న రుణంపై కొడుకును మందలించారన్నారు. దీంతో శ్యామ్ వెంకట్ ఆ రోజు నుంచి కనిపించకపోవడంతో శుక్రవారం రాత్రి తండ్రి గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్ఐ ఈశ్వరరావు తెలిపారు.

పోలీసులకు చిక్కిన గొలుసు దొంగ

పెందుర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై రివ్వున దూసుకు వచ్చి మహిళల మెడలోని బంగారు గొలుసులు తస్కరించి రెప్పపాటు కాలంలో మాయమయ్యే ఘరానా దొంగ పోలీసులకు చిక్కాడు. నిందితుడి నుంచి రెండు తులాల బంగారం, డియో స్కూటర్ మొత్తం రూ.రెండు లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం క్రైమ్ ఎస్ఐ డి.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కంచరపాలెం బర్మా క్యాంపు కాలనీకి చెందిన గురుగుబిల్లి పవన్‌కుమార్(20) అలియాస్ గ్యాంగ్ కంచరపాలెంలో డియో స్కూటీని చోరీ చేశాడు. అంతటితో ఆగకుండా అటువైపుగా ద్విచక్రవాహనంపై వస్తూ వెనుకన కూర్చుని ఉన్న వేపగుంట సమీపంలోని అప్పన్నపాలేనికి చెందిన వెంకటలక్ష్మి చేతితో పట్టుకుని ఉన్న వ్యానిటీబ్యాగ్ లాక్కున్నాడు. అందులో రెండు తులాల బంగారు మంగళసూత్రం ఉందని ఆమె శుక్రవారం పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన ఎస్ఐ సూరిబాబు దర్యాప్తు చేశారు. చోరీ జరిగిన ప్రాంతంలో సీసీ కెమేరాను పరిశీలించి ఇలాంటి గొలుసు దొంగతనాల్లో ఆరితేరిన గ్యాంగ్‌పై నిఘా పెట్టారు. దీంతో పవన్ పోలీసులకు దొరికాడు. నేర విభాగ పోలీసులు చురుగ్గా దర్యాప్తు చేపట్టి తక్కువ సమయంలో దొంగను చోరీ సొత్తుతో పట్టుకోగలిగామన్నారు. గొలుసు దొంగను అరెస్టు చేసిన ఎస్ఐ సూరిబాబు, హెచ్‌సీలు నాగరాజు, ఎంఎస్ నాయుడు శ్రీరామ్, భవాని, శివప్రసాద్, దేవుడు నాయుడు, ఎల్ఎస్ నాయుడు, విజయ్, లెంక తాతారావు, పైడిరాజులను ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావులు అభినందించారు.

అక్రమ తవ్వకాల ప్రాంతం చదును

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని చదును చేస్తున్న దృశ్యం

కొయ్యూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 516-ఈ నిర్మాణానికి కాకరపాడు- పిట్టచలం గ్రామాల మధ్య జరిపిన మట్టి తవ్వకాల ప్రాంతాన్ని కాంట్రాక్టరు చదును చేస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపి ఇక్కడి పాత రోడ్డును సుమారు పదడుగుల మేరకు లోతుగా మార్చేశారు. ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు. జాతీయ రహదారి నిర్మాణ పర్యవేక్షక సిబ్బంది, కలెక్టరు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని తక్షణం అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని చదును చేయాలని కాంట్రాక్టరును ఆదేశించారు. దీంతో శుక్రవారం నుంచి చదును చేసే పనులు ప్రారంబించారు. దీంతో శనివారం నాటికి ఈ ప్రాంతం పూర్వ పరిస్థితి సంతరించుకుంది. రామరాజుపాలెం, పి. మాకవరం వద్ద నిర్మించిన వంతెనల అప్రోచ్ రోడ్డుకు అవసరమైన మట్టి సరిపోక కాకరపాడు- పిట్టచలం మధ్య అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపారు. దీంతో ఈ ప్రాంతం ప్రమాదకరంగా మారింది.ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'వెలుగులోకి తేవటంతో అధికారులు స్పందించారు. ప్రమాదాలు నివారించేలా కాంట్రాక్టరుతో చర్యలు చేపట్టారు. దీనిపై కథనం ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'కి ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



సంపద కేంద్రంలో బోరు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ అనుషదేవి

చింతపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు చేతిపంపులు (బోర్‌వెల్స్) నిర్మిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సంపద కేంద్రం, మండల పరిషత్ ప్రాంగణంలో బోర్‌వెల్స్ నిర్మించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో జిల్లా పరిషత్ నిధులతో 16, మండల పరిషత్ నిధులతో తొమ్మిది చేతిపంపులను నిర్మిస్తున్నామన్నారు. ఆదివాసీల గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, కార్యదర్శి శ్రీధర్, పంచాయతీ గుమస్తా అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండాలి: ఎస్‌ఐ



పార్వతీనగర్‌లో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

సీలేరు, డిసెంబరు 28 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు పంచాయతీ పార్వతీనగర్‌లో గిరిజనులకు శనివారం సీలేరు ఎస్‌ఐ గంజాయి సాగు, రవాణా వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గిరిజన నిరుద్యోగ యువత డబ్బుకు ఆశ పడి గంజాయి రవాణాకు పాల్పడుతున్నారన్నారు. గంజాయితో పట్టుబడితే జైలులో మగ్గాల్సిందేనని హెచ్చరించారు. ప్రస్తుతం పలు జైళ్లల్లో ఎక్కువ మంది గిరిజన యువత గంజాయి కేసుల్లో పట్టుబడి జైళ్లలో ఉంటున్నారన్నారు. గంజాయి సాగుకు కూడా దూరంగా ఉండాలని, ప్రతీ ఒక్కరూ సాంప్రదాయ పంటలను మాత్రమే పండించాలన్నారు. అలాగే ఆటోలు, వాహనాలు నడిపే ప్రతీ ఒక్కరూ లైసెన్సులు కలిగి ఉండాలని సూచించారు.

సీలేరులో వాహనాల తనిఖీ

సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల నుంచి అక్రమ గంజాయి రవాణా నిరోధానికి స్థానిక ఐటీబి జంక్షన్, జెన్‌కో చెక్‌పోస్టుల వద్ద సరిహద్దు ప్రాంతాల నుంచి తెలంగాణకు వెళ్లే వాహనాలను తనిఖీలు చేపట్టారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

చింతపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుకు గిరిజనుల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఆ పార్టీ సీనియర్ నేత రీమల ఆనందరావు అన్నారు. శనివారం రామాలయం వీధిలో పార్టీ సభ్యతాల నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అభిమనాలు, మద్దతుదారులు కచ్చితంగా సభ్యత్వ నమోదు చేసుకోవాలన్నారు. సభ్యులకు పార్టీ తగిన సమయంలో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు, నాయకుడు దూనబోయిన రమణ పాల్గొన్నారు.

గొందూరులో ఉచిత వైద్య శిబిరం రేపు

పాడేరురూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన పాడేరు గొందూరులోఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నఆ సమితి ప్రతినిధులు తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాయత్రి ఆస్పత్రి వారి సహకారంతో వైద్య సేవలు అందిస్తామన్నారు. రోగులు ఆధార్ కార్డు, ఆరోగ్య శ్రీ కార్డులతో రోగులు హాజరుకావాలన్నారు.

సమావేశాలకు రాని అధికారులపై చర్యలు ఏవీ?

» డుంబ్రిగుడ మండల సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

డుంబ్రిగుడ, 28 డిసెంబరు (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి తోడ్పడే మండల సర్వ సభ్య సమావేశంలో అధికారులుకాకుండా కిందిస్థాయి శాఖల సిబ్బంది హాజరుకావడంపై ప్రజాప్రతినిధుల అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల ప్రగతి నివేదికను అధికారులు చదివి వినిపించారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు, సర్పంచులు మాట్లాడుతూ, సమావేశానికి కిందస్థాయి సిబ్బంది హాజరుకావడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలోనూ ఇదే విధంగా వ్యవహరించారన్నారు. అధికారుల తీరు మార్పు రాకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎంపీడీవో సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ అధికారులతీరు మార్చుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు. అలాగే, కోర్రా, కోర్రాయి పంచాయతీల్లో ప్రతిపాదించిన పనులు అమలు కావడం లేదన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు పునః ప్రారంభించాలని కోరారు. ఆర్థిక సంఘం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత తదితరులు పాల్గొన్నారు.

రాజ్మా పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

» జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నందు



సిగినాపల్లిలో మొలకెత్తిన రాజ్మా పంటను పరిశీలిస్తున్న డీఏవో నందు

చింతపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న గిరిజన రైతులు రాజ్మా పంటపై ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) నందు అన్నారు. శనివారం మండలంలోని కుదుపుసింగి గ్రామంలో గిరిజన రైతులు సాగు చేస్తున్న రాజ్మా పంటను జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేశ్‌తో కలిసి సందర్శించారు. రాజ్మా పంట కోత దిగుబడి ప్రయోగాన్ని పరిశీలించారు. ఎకరానికి సరాసరి 318 కిలోల రాజ్మా దిగుబడి వచ్చినట్టు గుర్తించారు. ఈసందర్భంగా డీఏవో మాట్లాడుతూ ఈ ఏడాది పంట కోత సమయంలో అకాల వర్షాలతో కొంత వరకు రైతులకు నష్టం జరిగిందన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల పంటలకు జరిగే నష్టాన్ని నివారణకు రైతులంతా పంట బీమాను చేయించుకోవాలన్నారు. దీని వల్ల విపత్తుల వల్ల 33శాతానికిపై పంటకు నష్టం జరిగితే పరిహారం వర్తిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం రాజ్మా పంటకు బీమా సదుపాయం కల్పించందన్నారు. బీమాకు ఈనెల 31 వరకు సమయం ఉన్నదన్నారు. రైతులు కచ్చితంగా మీసేవా కేంద్రాల వద్దకు వెళ్లి ప్రీమియం చెల్లించాలన్నారు. రాజ్మాలో దిగుబడులు పెంపొందించుకునేందుకు రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కంటా జాహ్నవి, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: రాజ్మా సాగురైతులు బీమా చేయించాలని డీఏవో ఎస్‌బీఎస్ నందు సూచించారు. శనివారం మండలంలోని సిగినాపల్లి, పెద్దజడుమురు, గూడెంపాతవీధి, పి.కొత్తూరు గ్రామాల్లో పర్యటించిన ఆయన వర్షాలకు మొలకెత్తిన రాజ్మా పంటను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కోత సమయంలో వర్షాలు పడడంతో రాజ్మా పంట మొలకెత్తినట్టు చెప్పారు. మండలంలో రాజ్మా పంటను నష్టపోయిన రైతుల జాబితాను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పంపించాలని స్థానిక వ్యవసాయ అధికారిని ఆదేశించారు. రైతులు పంట బీమా, ఈ-క్రాప్ నమోదను విధిగా చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రమేశ్, ఏడీఏ జాహ్నవి, ఏవో మధుసూదనరావు పాల్గొన్నారు.

వైద్య సేవలకు సహకారం భేష్: డీఎంహెచ్‌వో



వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

హుకుంపేట డిసెంబరు 28 ఆంధ్రజ్యోతి; గిరిజన చిన్నారులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు తోడ్పాటునందించడం అభినందనీయమని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. శనివారం మండలంలోని ఉప్ప ఆరోగ్య కేంద్రానికి హైదరాబాద్‌కు చెందిన సమారిటన్స్ ఫరది నేషన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో రూ. 2.5లక్షల విలువతో సమకూర్చిన హెల్త్ కేర్, మెడికల్ కేర్ ఎక్విప్‌మెంట్ పరికరాలను డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఆనం తరం ఆయన మాట్లాడుతూ గిరిజన పిల్లలను ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం గుర్తించి వైద్య పరికరాలు అందించడం వల్ల వారికి మెరుగైన వైద్య సేవలందించడానికి వీలవుతుందన్నారు. వీటిని స క్రమంగా సద్వినియోగం చేయాలని వైద్య సిబ్బందికి ఆయన ఆదేశించారు. ఈ కార్య క్రమంలో వైద్యాధికారి రేఖ, సంస్థ ఫౌండర్ రామ్‌కుమార్, సభ్యులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణల మేధావి మన్మోహన్ సింగ్

సీలేరు, డిసెంబరు 28 , (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్నిఆర్థిక మాద్యం నుంచి గట్టెక్కించిన ఘనత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కే దక్కుతుందని వక్తలు అ న్నారు. జీకేవీధి మండలం సీలేరులో శనివారం మార్కెట్ సెంటర్‌లో మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళుల ర్పించారు. స్థానిక డీసీసీ అధ్యక్షుడు కారే శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ పి.దుర్గో, ఎంపీటీసీ సభ్యుడు పి. సొంబమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలను వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె. వల్లీప్రసాద్, కూటమి నాయకులు చిటికెల రాము, సన్యాసిరావు, సీఐటీయూసీ నాయకులు ఎస్‌కే సుభాన్, లక్ష్మణ్, విష్ణుకుమార్‌రాజు, కాంగ్రెస్ నాయకులు వి. అప్పారావు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు ఎంపీడీవోపై దాడికి నిరసన



ఆందోళన చేస్తున్న ఎంపీడీవో లవరాజు,సిబ్బంది

అరకులోయ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా గాలివీడు మండల ఎంపీడీవో జవహర్ బాబుపై దాడికి పాల్పడిన ఎంపీపీ కుమారుడు సువర్ణన్‌రెడ్డిని కఠినంగా శిక్షించాలంటూ స్థానిక ఎంపీడీవో లవరాజు, సిబ్బంది, ఉపాధి పథకం సిబ్బంది డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఈమేరకు శనివారం ఈ నిరసన వ్యక్తం చేశారు. గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబు విధుల్లో ఉండగా, ఆయనపై అక్కడి ఎంపిపీ కుమారుడు సువర్ణన్‌రెడ్డి, మరికొంతమంది దాడికి పాల్పడటం దారుణమన్నారు. నిందితులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రగ్గులు, నిత్యావసర సరకులు వితరణ

అనంతగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంకయ్యపాలెం, చీడివలస, మండపర్తి గ్రామాల్లో శనివారం మోసెస్ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 500 రగ్గులు, బిరియాని, బియ్యం ప్యాకెట్లను గిరిజనులకు అందించారు.. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఎం.ఎస్.ఖాన్ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలోని చలితీవ్రత అధికంగా ఉన్నందున రగ్గులను గిరిజనులకు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు.

విద్యార్థుల సమస్యలపై 30న 'పోరు దీక్ష'

పాడేరురూరల్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయి తదితర సమస్యలపై ఈ నెల 30వ తేదీన విజయవాడలో జరిగే పోరు దీక్షలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంత విద్యార్థులు ప్రభుత్వాలపై ఆధారపడి చదువుకుంటున్నారన్నారు. గత ఐదేళ్లుగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల కాకపోవడంతో ఎంతో మంది గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణారావు, సహాయ కార్యదర్శి జి.తనీష్, సౌజన్య, మంగ, వి.దేవి, వి.సునీత, చంటి, జీవన్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన పినకోట సర్పంచ్



కలెక్టర్‌ను దీనేశ్‌కుమార్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ గణేశ్, నాయకులు

అనంతగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినకోట పంచాయతీ సర్పంచ్ శిరగం గణేశ్, శనివారం పాడేరులోని జిల్లా కలెక్టర్ దీనేశ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 21న ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ పినకోట పంచాయతీ పరిధిలో పర్యటన విజయవంతం కావడం పురస్కరించుకుని ఆయనను సన్మానించారు. అలాగే, డిప్యూటీ సీఎం పర్యటనలో ఆయన దృష్టికి పినకోట పంచాయతీలో సమస్యలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల సమస్యలను తీసుకువచ్చారు. వీటిపై కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపడంతో ఒక్కోటి పరిష్కారం దిశగా అడుగులు పడ్డాయి. అలాగే, కివర్ల పంచాయతీ పందిరిమామిడి నుంచి నక్కులమామిడి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకావడంపై ఎంపీటీసీ దూరియ నూకరాజు, వార్డు మెంబర్లు గడ్డన్న, గ్రామస్థులు కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్యపై వినతి

ముంచంగిపుట్టు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల కించాయిపుట్టు పంచాయతీ మినుములపుట్టు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గిరిజన మహిళా సంఘం మండల అధ్యక్షురాలు ఈశ్వరి అన్నారు. ఆ సంఘం ఆధ్వరంలో గ్రామస్థులు తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో శ్రీసాయిహర్షకు శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ గ్రామానికి వచ్చే పైప్‌లైన్ మరమ్మతుకు గురికావడంతో గత 15 రోజులుగా తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నట్టు వాపోయారు. అలాగే గ్రామంలో జల్ జీవన్ మిషన్ నీటి పథకం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని వాపోయారు.

గిరి విద్యార్థులతో కలెక్టర్ భేటీ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ శనివారం సాయంత్రం తన బంగ్లాలో గిరిజన విద్యార్థులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల స్థితిగతులు, వారి విద్యాభ్యాసం, భవిష్యత్తుపై ఉన్న ఆలోచనలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తుపై చక్కని ప్రణాళికతో చదువుకుని ఉన్నత స్థితికి చేరుకునేందుకు పట్టుదలతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఉన్నత విద్య, ఉద్యోగాలకు సంబంధించిన కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వపరంగా అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖాధికారులు, గిరిజన బాలబాలికలు పాల్గొన్నారు.

బాల, బాలికలకు భవిష్యత్తుకి పునాది వేయాలి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి

అనంతగిరి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయంతో ముందుకుసాగి బాల, బాలికల భవిష్యత్తుకు పునాదివేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సూర్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని శనివారం కిశోరివికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ.. బాలికలపై అఘాయిత్యాలు జరగకుండా వారికి అవగాహన కల్పించాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు మాట్లాడుతూ.. బాల, బాలికలకు ఉన్నత భవిష్యత్తునిచ్చేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీలు ఆరు శాఖల సహకారంతో కిశోరి వికాస కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా. చదువును మానేసిన బాల, బాలికల గుర్తింపు, కిశోరీ సమూహాల ఏర్పాటు , విద్య, వైద్యం, పరిశుభ్రత, బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. పోక్సో చట్టం, వృత్తివిద్య, సంరక్షణ తదితర వాటిపై ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏవీవీ కుమార్, సీడీపీవో సంతోషికుమారి, ఏసీడీపీవో అచ్యుతాంబ పాల్గొన్నారు.

పకడ్బందీగా మహిళా చట్టాలు అమలు

» జిల్లా ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ జడ్జి రమేశ్



డుంబ్రిగుడ న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేశ్

డుంబ్రిగుడ, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలు పకడ్బందీగా అమలయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ జడ్జి, అరకులోయ లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్ ఎ.రమేశ్ సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జాతీయ మహిళ కమిషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంబించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కొంతమంది మహిళలు గంజాయి, సారా కేసుల్లో మగ్గుతున్నారని చెప్పారు. సమాజంలో మహిళలపై వివక్షత రూపుమాపేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి సూర్యలక్ష్మి, ఎంపీడీఓ ప్రేమ్‌కుమార్, ఎస్‌ఐ పాపినాయుడు, సీడీపీవో నీలిమ, న్యాయవాది మురళీపట్నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు: బాల్య వివాహాలను అరికట్టాలని జిల్లా జడ్జి ఎ.రమేశ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిధిగా ఆయన మాట్లాడారు. అబ్బాయిలకు 21, అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు జరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రసాదరావు, ఎంపీడీవో పూర్ణయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు, ఎస్‌ఐ రమణ, ఐసీడీఎస్ పీవో వరలక్ష్మి, ఎంఈవో కృష్ణమూర్తి,ఏవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాజుబాబు, అధికారులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల మృతిపై ప్రభుత్వం స్పందించాలి

» పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేరరరాజు

కొయ్యూరు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో విద్యార్థుల మృతిపై ప్రభుత్వం స్పందించాలని పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు డిమాండ్ చేశారు. శనివారం కొయ్యూరు గురుకుల పాఠశాలను సందర్శించారు. ఇటీవల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మనోజ్ తేజ్ మృతి చెందడంపై కారణాలపై విద్యార్థులు, సిబ్బందిని విచారించారు. అనంతరం విద్యార్థి హాజరు తదితర విషయాలపై రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ గిరిజన సంక్షేమ, గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మృతి చెందుతున్న ఘటనలు ఎక్కువయ్యాయన్నారు. 40 రోజులుగా 280 మంది గురుకుల పాఠశాల అధ్యాపకులు వారి సమస్యలపై నిరసన కొనసాగిస్తుండడంతో పాఠశాలల్లో విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడిందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు నూకాలమ్మ, చింతపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ రాజులమ్మ, నేతలు సుమర్ల సూరిబాబు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మునిలి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు సైకిల్ యాత్ర



సైకిళ్లపై శబరిమల బయలుదేరిన నక్కపల్లికి చెందిన దీక్షాపరులు

నక్కపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): నక్కపల్లికి చెందిన ఐదుగురు అయ్యప్పస్వామి భక్తులు శనివారం ఇక్కడి నుంచి శబరిమలకు సైకిళ్లపై బయలుదేరారు. మకరజ్యోతి దర్శనం కోసం అయ్యప్ప దీక్ష చేపట్టిన నక్కపల్లికి చెందిన గురుస్వామి కొల్నాటి గోవిందరాజు, గోవాడ అప్పారావు, బి.రాము, బొద్దపు సూరిబాబు, ఉపమాకకు చెందిన పొన్నాడ నారాయణరావు 1500 కిలో మీటర్ల సైకిల్ యాత్రను నక్కపల్లి ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంబించారు.

లగిశపల్లిలో రెవెన్యూ సదస్సు

పాడేరురూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొర్రా నాగరాజు అన్నారు. మండలంలోని లగిశపల్లి సచివాలయంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు మాట్లాడుతూ లగిశపల్లి సదస్సులో ప్రజల నుంచి 138 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ లకే పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు లకే రామకృష్ణ పాత్రుడు, డీటీ పి.పోలురాజు, ఎలక్షన్‌డీటీ కె.లక్ష్మణమూర్తి, ఆర్ఐ కూడా భాస్కరరావు, మండల సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వో కె.నర్సింహం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రతన్‌టాటా సేవలు ఆదర్శనీయం

చింతపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త రతన్‌టాటా సేవలు అభినందనీయమని వర్తక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జోగేశ్వరరావు, పెదిరెడ్ల బేతాళుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో రతన్‌టాటా జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు.ఈకార్యక్రమంలో టీడీపీ నేత రీమల ఆనందరావు, వర్తక సంఘం నాయకుడు దూనబోయిన రమణ పాల్గొన్నారు.

వారపు సంతలో పోలీసులు వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు : స్థానిక వారపు సంతలో సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రం వచ్చే వాహనాలను, అలాగే, పెదబయలు, జోలాపుట్టు, సంగడ, కుమడ, లక్ష్మీపురం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

పెసా కమిటీ ఎన్నికలపై శిక్షణ

పెదబయలు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుర్తించిన 185 గ్రామాల్లో జనవరి 3వ తేదీనుంచి 7వ వరకు జరిగే పెసా కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో అధికారులకు, పంచాయితీ కార్యదర్శులకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ అందించినట్టు ఎంపీడీవో పూర్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు, ఈవోపీఆర్‌డీ నరసింగరావు పాల్గొన్నారు.

కొనసాగిన గ్రామ వలంటీర్ల నిరసన

పాడేరురూరల్, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు వలంటీర్లు తమను రెన్యువల్ చేయాలని కోరుతూ శనివారం ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజుకు వినతిపత్రం అందించారు. జిల్లాలోని గతంలో విధులు నిర్వహించిన 500 మంది వలంటీర్లు ముందుగా భారీ ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, ఎం.సింహాచలం, వీఎస్‌కే.నాయుడు, జి.సత్యారావు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో శనివారం వలంటీర్ల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందించారు. సీఐటీయూ నేత సన్నిబాబు, గిరిజన సంఘం నేత ధర్మనపడాల్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా వారు చేపడుతున్న వలంటీర్ల రిలే నిరాహార దీక్షలు శనివారం ముగిసింది. ముందుగా వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీవో శ్రీసాయిహర్షకు అందించారు. పలువురు నాయకులు కె.శంకరరావు, దేవ, పి.రామదాసు, పి.భీమరాజు పాల్గొన్నారు.

చింతపల్లి: గ్రామ, వార్డు వలంటీర్లను ప్రభుత్వం విధుల్లోకి తీసుకోవాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వలంటీర్లు రిలే నిరాహార దీక్షల్లో పాల్గొని మాట్లాడారు. వలంటీర్ల నాయకుడు వేములపూడి పరమేశ్వరరావు, గిరిజన సంఘం నేత పాంగి ధనుంజయ్ పాల్గొన్నారు.

ప్రతీ సమావేశానికి దుమ్మా కొట్టడమేనా..?

అధికారులు రాకపోతే సమస్యలు ఎవరికి విన్నవించాలి?

ఏఎల్‌పురం వైద్యాధికారి రెండేళ్లుగా గైర్హాజరుకావడం సరికాదు

సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ధ్వజం




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి... అధికారులను నిలదీస్తున్న గాధంపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

గొలుగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి కూడా మండల స్థాయి అధికారులు ప్రతీసారి దుమ్మా కొట్టడమేనా..? సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకపోతే సమస్యలను ఎవరికి విన్నవించాలి? అని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఎల్‌పురం పీహెచ్‌సీలో అదనపు భవనం ప్రారంభానికి ప్రజాప్రతినిధులకు సమాచారం అందించలేదని ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్ తెలిపారు. అలాగే ఏఎల్‌పురం పీహెచ్‌సీ వైద్యాధికారి రెండేళ్లుగా సర్వసభ్య సమావేశానికి హాజరుకావడం లేదని, ఇది సరికాదని పేర్కొన్నారు. గొలుగొండలో గ్రామ సచివాలయ, రైతు సేవా కేంద్రాల భవనా నిర్మాణాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయని, వాటిని పూర్తిస్థాయిలో నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని గొలుగొండ గ్రామ సర్పంచ్ కసిపల్లి చినప్పారావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టరాదని మండల స్థాయి అధికారులకు తెలిపినా గొలుగొండలో స్థానిక ప్రజాప్రతినిధులకు ఎటువంటి సమాచారం లేకుండా షెడ్ల నిర్మాణం కోసం రైతులకు అధికారులు కొలతలు ఇవ్వడం దారుణమన్నారు. దీనిపై వైద్యాధికారి రమేశ్ కలుగజేసుకుని సమస్యల పరిష్కారం అనంతరం మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టాలని స్పీకర్ తమకు ఆదేశించారని తెలిపారు. కొత్తఎల్లవరం, గుండుపాల కొత్తూరు గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, దీన్ని పరిష్కరించాలని కొత్తఎల్లవరం సర్పంచ్ రాంబాబు కోరారు. మండలంలోని ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో లబ్ధిదారులకు బిల్లుల మంజూరులో పలువురిని పక్కన పెడుతున్నారని గాధంపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు ఆరోపించారు. రైతు కళ్లాల వద్దకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేపడుతున్నామని వ్యవసాయాధికారి సుధావాణి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రబీ, ఖరీఫ్ సీజన్లలో సాగుచేసే వివిధ రకాలైన పంటలకు బీమా చేయించుకునే విధంగా చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమాలను రైతులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని గ్రామ, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కాగా, ఇకపై మండల సమావేశాలకు అన్ని శాఖలు అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మేరీరోజీ, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, పలు గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

జగన్ అవినీతి వల్లే పెరిగిన విద్యుత్ చార్జీలు

▸ వైసీపీ పాలనలో ఇష్టారాజ్యం ▸ టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల తాతయ్యబాబు

తుమ్మపాల, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌రెడ్డి అవినీతి వల్లే విద్యుత్ చార్జీలు పెరిగాయని గృహ నిర్మాణ కార్పొరేషన్ ఛైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు ఆరోపించారు. శనివారం అనకాపల్లిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెకీ ఒప్పందంతో జగన్‌రెడ్డి రూ.1500 కోట్లు దోచేశారన్నారు. విద్యుత్ చార్జీలు పెంచేందుకు నాడు అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపాదనలు పంపిన జగన్‌రెడ్డి, నేడు ధర్నాలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన అందిస్తుండడంతో అది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులంతా దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు మారిశెట్టి శంకర్రావు, కొణతాల కారుబాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.18 లక్షలతో రోడ్ల మరమ్మతు పనులు

▸ ఆర్‌అండ్‌బీ డీఈ విద్యాసాగర్

రావికమతం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రహదారులను రూ.18 లక్షలతో మరమ్మతు చేస్తున్నట్టు నర్సీపట్నం సబ్ డివిజన్ ఆర్‌అండ్‌బీ డీఈ ఆర్.విద్యాసాగర్ తెలిపారు. రావికమతం-మరుపాక, చినపాచిల-కొమిర, తట్టబంద-జె.నాయుడుపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్లలో జరుగుతున్న పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా రావికమతం-మరుపాక రోడ్డులో దెబ్బతిన్న చోట్ల ప్యాచ్ వర్క్ పనులు చేపడుతున్నామని చెప్పారు. రావికమతం-వయా తోటకూరపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు బాగా ధ్వంసం కావడంతో మరమ్మతులు సాధ్యం కానందున పూర్తి స్థాయిలో అభివృద్ధి కోసం రూ.9 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆయన తెలిపారు. ఈ నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని, త్వరలోనే ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని వివరించారు.

వినికిడి పరికరాల పంపిణీకి వైద్య పరీక్షలు రేపు

నర్సీపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వినికిడి పరికరాల పంపిణీకి ఈ నెల 30వ తేదీ నర్సీపట్నంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆస్పత్రి సమీపం, నర్సీపట్నం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రంలో ఏరియా ఆస్పత్రి వైద్యులతో వినికిడి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి దీన్ దయాల్ శ్రావణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినికిడి పరికరాలు అందిస్తారని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చేటప్పుడు పేషెంట్ ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో తీసుకురావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీ హామీతో గోవాడ కార్మికుల ఆందోళన విరమణ

చోడవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్స్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు హామీ ఇవ్వడంతో శనివారం కార్మికులు ఆందోళన విరమించారు. వేతన బకాయిలు, ఇతర అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి గుర్తింపు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. శనివారం ఎండీతో పాటు వివిధ విభాగాల అధికారులు కార్మికులతో చర్చలు జరిపారు. దశలవారీగా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, కాంట్రాక్టు కార్మికులకు ఓటీ బకాయిలు, ఉద్యోగ విరమణ పొందిన కార్మికులకు గ్రాట్యూటీని త్వరలో చెల్లిస్తామని ఎండీ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆందోళన విరమించి కార్మికులు విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం నాయకులు కేవీవీఎస్.భాస్కరరావు, రాపేటి జగన్నాథరావు, బండి శ్రీను, ప్రకాశ్, రమణ, టైగర్ అప్పారావు, నూకరాజు పాల్గొన్నారు.

అవంతిలో ముగిసిన సృజన సాంకేతిక ప్రదర్శన

మాకవరపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అవంతి కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సృజన సాంకేతిక ప్రదర్శన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా మనస్తత్వవేత్త విజయలక్ష్మి, ప్రొఫెసర్ మురళీకృష్ణ, అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ ఇటువంటి వినూత్న ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత బయట పడుతుందన్నారు. సాంకేతిక విద్యను ప్రోత్సహించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం పలు పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు నమూనాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అవంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉషోదయలో ఐఐటీపై అవగాహన సదస్సు రేపు

చోడవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 30న ఐఐటీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులలో విద్యార్థులకు ఉన్న భయాన్ని పోగొట్టి వారిని ఐఐటీ దిశగా ప్రోత్సహించే లక్ష్యంతో రమణాజీ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఐటీ ఖరగ్ పూర్ ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ హాజరుకానున్నారు. టాలెంట్ టెస్ట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతులు కూడా అందిస్తామని రమణాజీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జె.రమణాజీ తెలిపారు. ఈ సదస్సును విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

బెంగళూరు పరిశోధన సంస్థకు విత్తన నమూనాలు

దేవరాపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొత్తపెంట రైతులు రసాయన ఎరువులు వాడకుండా మేలైన పద్ధతులు పాటించిన వరిపంట విత్తన నమూనాలను బెంగళూరు పరిశోధన సంస్థకు పంపామని వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ తెలిపారు. తక్కువ పురుగు మందులు, తక్కువ ఎరువులు వాడి, పర్యావరణానికి హాని కలగకుండా 21 మంది రైతులు ఆరోగ్యకరమైన పంటలు పండించారని చెప్పారు. వారు వినియోగించిన వరి విత్తనాల నమూనాలను ధ్రువీకరించేందుకు బెంగళూరుకు పరిశోధన సంస్థకు పంపామని, అక్కడి నుంచి అనుకూల ఫలితాలు వస్తే ఆన్‌లైన్‌లో విక్రయించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం రైతులకు మేలు చేకూర్చుతుందన్నారు.

బుచ్చెంపేటలో క్వారీ లారీల అడ్డగింత



బుచ్చెంపేటలో బండ రాళ్ల లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

రోలుగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట, వడ్డిప మీదుగా భారీ బండ రాళ్లతో తిరుగుతున్న వాహనాలను శనివారం బుచ్చెంపేటలో గ్రామస్థులు అడ్డుకున్నారు. 'బండరాళ్ల వాహనాలతో భయం భయం' అన్న శీర్షికన శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. లారీల వల్ల రోడ్లు పాడవుతున్నాయని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఎన్నిమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినా స్పందించడం లేదని గ్రామస్థులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో తామే లారీలను అడ్డుకున్నామని వారు తెలిపారు. సమస్య పరిష్కారమయ్యేవరకు లారీలను కదలనిచ్చేది లేదని తేల్చిచెప్పడంతో గ్రామంలో గందరగోళ వాతావరణం నెలకొంది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి గ్రామస్థులతో మాట్లాడారు. క్వారీ యాజమాన్యాన్ని రప్పించి చర్చించారు. రేపటి నుంచి ఈ గ్రామం మీదుగా వాహనాలను నడపమని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు శాంతించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



జోగంపేటలో చెత్తాచెదారం, తుప్పలను తొలగిస్తున్న కార్మికులు, అధికారులు

గొలుగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగంపేట గ్రామంలో శనివారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. జోగంపేట, ద్వారకానగరం గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జువ్వల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సు ఏర్పాటుచేయాలని నిరసన

రోలుగుంట, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోసింగిలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం గిరిజనులు నిరసన చేపట్టారు. లోసింగి పరిధిలో పిత్రిగెడ్డ, పెదగరువు, కొత్త లోసింగి గ్రామాలు ఉన్నాయని, 62 కుటుంబాలు కొండ శిఖర గ్రామాల్లో నివసిస్తున్నాయని, ఇక్కడ రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేస్తే తమ సమస్యలపై అధికారులకు మొర పెట్టుకుంటామని వారు నినాదాలు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

పెందుర్తి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనంలో హైదరాబాద్‌కు చెం దిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. సుజాతనగర్‌లో అపార్ట్‌మెంట్‌లో కొన్ని ఫ్లాట్ల పనులు నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం వాచ్‌మన్ అన్ని ఫ్లాట్లను పరిశీలించాడు. ఐదో అంతస్తులో తలుపులు బిగించని ఓ ఫ్లాట్ బాత్‌రూమ్‌లో గల షవర్‌కు తాడుతో ఉరేసుకుని ఉన్న యువకుడి మృతదేహం కనిపించింది. దీంతో వాచ్‌మన్ ఆందోళన చెంది పెందుర్తి పోలీసులకు సమాచారమిచ్చాడు. సీఐ సతీశ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. యువకుడి మృతిపై అనుమానాలు వ్యక్తంకావడంతో మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. బాత్‌రూమ్‌లో గల షవర్‌కు నైలాన్ తాడు కట్టి మెడకు బిగించుకుని, రెండు మోకాళ్లు కిందికి వేలాడుతూ ఉన్న స్థితిలో మృతదేహం కనిపించింది చేతి మణికట్టు కోసుకున్నట్లు గాయం ఉంది. సమీపంలో ఆధారాల కోసం వెదకగా బ్యాగు కనిపించింది. అందులో ఆధార్, పాన్ కార్డు తాడు, కత్తెర, సెల్‌ఫోన్ పోలీసులకు లభ్యమయ్యాయి. ఆధార్ కార్డులో ఉన్న వివరాల ఆధారంగా మృతుడు పి.వి. శ్రీకాంత్, వయస్సు 27 సంవత్సరాలు, హైదరాబాద్ అని ఉంది. ఇతను ఓ ప్రముఖ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అని ఐడీ కార్డు ద్వారా తెలిసింది. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు మృతుడివేనా? అన్న నిర్ధారణ కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి ఆత్మహత్యగా పోలీసులు భావిస్తున్నారు. తాను చనిపోతున్నట్లు రెండు రోజుల కిందటే కుటుంబ సభ్యులకు వీడియో కాల్ చేశాడని పోలీసులు అంటున్నారు. హైదరాబాద్ నుంచి సుజాతనగర్‌కు వచ్చి ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియాల్సి ఉంది. క్లూస్ టీం, జాగిలాన్ని రప్పించి పోలీసులు మరిన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రాథమికంగా ఆత్మహత్యగా భావిస్తున్నామని ఇందులో వేరే కోణం ఏదైనా ఉందా? అన్నది దర్యాప్తులో తెలుస్తుందని సీఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేక అస్తవ్యస్తం



ఎస్సీ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మూర్తి

చీడికాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతవరం ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు పైల ముత్యాలనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం మండల ప్రత్యేక అధికారి కేవీఎస్ఎల్ఎన్.మూర్తి, ఎంపీడీవో హేమసుందర్రావులకు ఫిర్యాదుచేశారు. దీంతో స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా జైతవరం ఎస్సీ కాలనీని డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణతో కలిసి అధికారులు పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించి నిర్మాణానికి అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఈర్లె చైతన్య కోరారు. దీనిపై మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ పంచాయతీ పెద్దలు సంబంధిత రైతుతో మాట్లాడి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొల్లి నవీన్ పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి మూర్తి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వైవీఎస్.ప్రసాద్, ఎంఈవో బొంజుబాబు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్

చోడవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం విధాన్‌పే సమాధాన్ పేరిట మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మండల లీగల్‌సెల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్ అధ్యక్షత వహించి మహిళల కోసం రూపొందించిన చట్టాలు, అవి కల్పించే రక్షణ, హక్కుల గురించి వివరించారు. చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీవో అనంతలక్ష్మి, ఎస్ఐ జోగారావు, న్యాయవాది కొలగాని సతీష్ పాల్గొన్నారు.


సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకోండి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న అధికారులు

నాతవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమక్షంలో సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి నాగశిరీషా, ఎంపీడీవో ఉషశ్రీ, ఎస్ఐ సిహెచ్.భీమరాజుతో కలిసి శనివారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల్లో ఇళ్ల స్థలాల సరిహద్దు సమస్యలను ఇరు వర్గాల వారిని కూర్చోబెట్టి పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. శనివారం నాతవరం, వెన్నలపాలెం, వెదురుపల్లి, కొండధర్మవరం గ్రామాలకు సంబంధించి ఇళ్ల సరిహద్దులు, చెట్ల సమస్యలు తమ దృష్టికి తీసుకురాగా రెండువర్గాల వారిని కూర్చోబెట్టి సామరస్యంగా పరిష్కరించినట్టు చెప్పారు. అలాగే నాతవరంలో కశింకోట కొండబాబు, శెట్టి బాపన్నలకు సంబంధించి ఇళ్ల దారి సమస్యను టీడీపీ నాయకులు పారుపల్లి కొండబాబు ఎన్.విజయ్‌కుమార్, బంగారు సూరిబాబు, శెట్టి నానాజీ మండల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజు పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన'



మేడివాడలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న టీడీపీ శ్రేణులు

రావికమతం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేజరు పంచాయతీ మేడివాడలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని సర్పంచ్ వీఎల్.నాగవెంకటరత్నం చెప్పారు. గ్రామంలో శనివారం పార్టీ శ్రేణులతో ఇంటింట తిరిగి సభ్యత్వ నమోదు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు పాలనపై ప్రజల్లో ఎంతో నమ్మకం కలిగిందన్నారు. దీంతో సభ్యత్వాలు తీసుకోవడానికి ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారన్నారు. గ్రామంలో 1060 సభ్యత్వాల నమోదు లక్ష్యం కాగా, ఇప్పటికి 879 పూర్తయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత వజ్రపు శివ, టీఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ గొర్లె సాంబశివ, మాజీ సర్పంచ్ ఎ.రామారావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు యన్నంశెట్టి శేషుబాబు, నాయకులు విజయ్‌కుమార్, కె.చినబాబు, జి.వెంకటరమణ, వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రమాద బీమా

చీడికాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని కోనాం జలాశయం మాజీ ఛైర్మన్ గండి ముసలినాయుడు అన్నారు. చీడికాడ శివారు గోపీనగర్ కాలనీలో శనివారం పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తున్నదని చెప్పారు. అన్ని వర్గాల వారు సభ్యత్వం తీసుకునేందుకు ముందుకురావాలని కోరారు. అలాగే సభ్యత్వం తీసుకున్న కుటుంబంలో ఎవరు మృతిచెందిన దహన సంస్కరణల కింద రూ.10 వేలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేత గండి లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించండి

▸ మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు

మాకవరపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులగణన జాబితాలపై అభ్యంతరాలు వస్తే స్వీకరించాలని మండల ప్రత్యేకాధికారి మోహన్‌రావు సూచించారు. మండలంలోని పైడిపాల, పెద్దిపాలెం, బూరుగుపాలెం, చామంతిపురం, తామరం గ్రామాల్లో ఎస్సీ కులగణన జాబితాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయాల ఉద్యోగులతో మాట్లాడుతూ వీటిపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించాలన్నారు. ఈ నెల 31వ తేదీ నాటికి ఎస్సీ కులగణన వివరాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న చెత్త సంపద కేంద్రాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ చెత్త సంపద కేంద్రం ఆచరణలోకి తీసుకురావాలని ఆయన తెలిపారు. అనంతరం ప్రతీ శనివారం గ్రామాల్లో నిర్వహించే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని పైడిపాల రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ డీఈ వి.రామకృష్ణరావు తెలిపారు. 11కేవీ ఫీడర్ పరిధిలోని మాకవరపాలెం, బుల్క్‌మిల్క్ కూలింగ్ సెంటరు, తామరం, రాచపల్లి జంక్షన్, కొత్తపాలెం, అవంతి కాలేజీ, 11కేవీ గిడుతూరు ఫీడర్ పరిధిలో గిడుతూరు, బయ్యవరం, ఎన్.జి.ఆర్.పి.అగ్రహారం, నారాయణరాజుపేట, బీఎస్‌పేట రామన్నపాలెం, జంగాలపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. అలాగే 11కేవీ జి.కోడూరు ఫీడర్ పరిధిలో రాచపల్లి, జి.కోడూరు, నగరం, సుబ్రహ్మణ్యపాలెం, 11కేవీ బూరుగుపాలెం ఫీడర్ పరిధిలోని పైడిపాల, పెద్దిపాలెం, వెంకటాపురం, తాడపాల, తూటిపాల, పాపయ్యపాలెం బుచ్చన్నపాలెం, మునిసిడిపాలెం, 11కేవీ శెట్టిపాలెం ఫీడర్ పరిధిలోని కొండలఅగ్రహారం, లచ్చన్నపాలెం, గంగవరం, దాలింపేట, సీతన్నఅగ్రహారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు ఈ అంతరాయాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

భూ సమస్యలపై ప్రజా వేదికకు విశేష స్పందన

గొలుగొండ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయంలో భూ సమస్యలపై కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా వేదికకు ఫిర్యాదుదారుల నుంచి విశేష స్పందన లభించింది. తహసీల్దార్ శ్రీనివాసరావు, గొలుగొండ, కృష్ణాదేవిపేట ఎస్ఐలు రామారావు, తారకేశ్వరరావు, మండల ప్రత్యేకాధికారితో కూడిన మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రజావేదిక నిర్వహించారు. రావణాపల్లి, గొలుగొండ, ఏటిగైరంపేట, లింగంపేట గ్రామాల నుంచి భూ వివాదాలకు చెందిన ఇరు వర్గాలను మండల కమిటీలో సమావేశపర్చి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

మాకవరపాలెం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సోమశేఖర్ సూచించారు. పెద్దిపాలెం గ్రామంలో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చమ్మచింత పాఠశాలకు ప్రింటర్ వితరణ

నాతవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చమ్మచింత ప్రాథమిక పాఠశాలకు గంధం సునీత, గిరిధర్ దంపతులు ప్రింటర్‌ను వితరణగా అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాలకు సౌకర్యాలు కల్పించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.జగన్నాథరావు, మహిళా శక్తి సభ్యులు అనూష, శ్రేయోభిలాషి సంస్థ అధ్యక్షుడు నానాజీ పాల్గొన్నారు.

బుద్ధుడు మందిరం ఏర్పాటుకు స్థలం కేటాయించరూ..

రావికమతం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకోట గ్రామంలో బుద్ధుడు మందిరం నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలని అంబేడ్కర్ యువజన సేవా సంఘ సభ్యుల కోరారు. ఈ మేరకు సంఘ సభ్యులు మల్లేటి రాజు, బుంగా బుల్లిబాబు, ఎంపీటీసీ సభ్యులు పూడి దేవా, అప్పారావు తదితరులు శనివారం ఈవో జ్యోతీశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఎన్ రోడ్డును ఆనుకుని పశువుల ఆస్పత్రికి ఎదురుగా ఉన్న సర్వే నంబరు 140/1లో సుమారు మూడు సెంట్లు కేటాయించాలని ఈవోను కోరినట్టు చెప్పారు. దాతలు కూడా ముందుకు వస్తున్నందున త్వరతగతిన పంచాయతీ అనుమతులు ఇవ్వాలని కోరగా, ఈవో సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

నిస్సీ మినిస్ట్రీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

దేవరాపల్లి, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నిస్సీ మినిస్ట్రీస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎస్ఐ టి.మల్లేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. కాశీపురంలోని సియోన్ ప్రార్థనా మందిరంలో మందిరం వ్యవస్థాపకుడు గొర్లె టైటస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పాస్టర్ జయరాజ్, స్థానిక నేతలు పవన్ రాజు, ప్రకాష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షురాలిగా పైలా అమ్మాజీ



కె.కోటపాడు, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షురాలిగా కె.కోటపాడుకు చెందిన పైలా అమ్మాజీ ఎన్నికయ్యారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో ఎన్నికల కమిటీ ఇన్‌చార్జి ధర్మిశెట్టి నారాయణరావు ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ మాడుగుల ఇన్‌చార్జి మేరపరెడ్డి శ్రీనివాస్, జిల్లా నాయకులు కొట్టాన ఈశ్వరరావు, కె.గంగునాయుడు, ఎస్.సన్యాసినాయుడు, జె.సూర్యనారాయణ, బి.సత్యనారాయణపాత్రుడు, వర్రి వెంకటరావు, ఇమంది సన్యాసిరావు, కె.అప్పారావు, దొగ్గ కృష్ణవంశీ, బి.శ్రీరామ్మూర్తి, బి.శ్రీరామ్మూర్తి, కె.గంగునాయుడు, ఎస్.శివ, సిరపరపు శివ, కె.గంగునాయుడు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన నేవీన్యాసాలు


విశాఖ సాగర తీరంలో శనివారం సాయంత్రం నిర్వహించిన నేవీ విన్యాసాలు ఆద్యంతం అదరహో అనిపించేలా సాగాయి. నీలాకాశం నుంచి మెరైన్ కమెండోలు పారాచూట్లతో కిందకు దిగడం, నడిసంద్రంలోని యుద్ధ నౌకపై హెలికాప్టర్ ల్యాండింగ్ కావడం, శత్రుమూకలపై నావికాదళాలు దాడికి పాల్పడడం, సముద్రంలో మునిగిపోతున్న వారిని హెలికాప్టర్ సాయంతో రక్షించడం వంటి విన్యాసాలు అబ్బురపరిచాయి.


జెమినీ బోట్లతో తీరానికి దూసుకువస్తున్న కమెండోలు


పారాచ్యూట్ సాయంతో కిందకు దిగుతున్న మెరైన్ కమెండో


శత్రువుల బారినుంచి సైనికులను విడిపిస్తున్న కమెండోలు


దాడి అనంతరం శత్రు శిబిరం నుంచి తరలివెళుతూ..



హెలికాప్టర్ నుంచి దిగుతున్న కమాండోలు




యుద్ధ నౌకపై దిగుతున్న హెలికాప్టర్


విన్యాసాలను మొబైల్‌లో చిత్రీకరిస్తున్న మహిళ


కంటిన్యుటీ ఫైర్ డ్రిల్..


వాటర్ బాంబ్


సబ్‌మెరైన్ ప్రదర్శన


చేతక్ హెలికాప్టర్ల విన్యాసాలు


డార్నియర్ యుద్ధ విమానం


జాతీయ పతాకంతో చేతక్ హెలికాప్టర్ ప్రదర్శన


విన్యాసాలను తిలకిస్తున్న నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు

విశాఖ సెంట్రల్ జైలు ఎదుట వార్డర్లు, కుటుంబ సభ్యుల ఆందోళన

- ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వేధిస్తున్నారని ఆరోపణ
- తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్


జైలు ప్రధాన ద్వారం ఎదుట ఆందోళనకు దిగిన వార్డర్ల కుటుంబ సభ్యులు

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని కేంద్ర కారాగారం ఎదుట జైలు వార్డర్ల కుటుంబసభ్యులు శనివారం ఆందోళనకు దిగారు. తమను విధి నిర్వహణ పేరుతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు వేధిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి వార్డర్లు, వారి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వార్డర్లుగా పనిచేస్తున్న జయకృష్ణ, శంభు శనివారం ఉదయం విధి నిర్వహణ నిమిత్తం జైలు ప్రధానద్వారం దాటి లోపలకు ప్రవేశించారు. గంజాయి లోపలకు తీసుకువస్తున్నారనే అనుమానంతో వారిద్దరినీ అక్కడే ఉన్న ప్రైవసీ గదిలోకి తీసుకువెళ్లి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు తనిఖీ చేశారు. ఖైదీల ఎదురుగా దుస్తులు విప్పించి తనిఖీ చేయడంపై వార్డర్లు అభ్యంతరం వ్యక్తంచేశారు. దాంతో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు దురుసుగా ప్రవర్తించడంతోపాటు అసభ్యపదజాలంతో దూషించారు. ఆ విషయాన్ని ఇద్దరూ తోటి వార్డర్లకు చెప్పడంతో అందరూ సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో బయటకు వచ్చి ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ విధి నిర్వహణ పేరుతో తమను వేధిస్తున్నారని, అసభ్యంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. తమకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మిగిలిన అధికారులు వచ్చి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించి జైలు ఆవరణలోని క్వార్టర్లకు వెళ్లిపోయారు. కొంతసేపటి తర్వాత సూపరింటెండెంట్ తనను ఎవరూ ఏమీ చేయలేరని వ్యాఖ్యానించినట్టు తెలుసుకుని వార్డర్లు తమ కుటుంబసభ్యులతో కలిసి వచ్చి మళ్లీ జైలు ప్రధాన ద్వారం వద్ద ఆందోళనకు దిగారు. వార్డర్లు పక్కన నిలబడితే వారి కుటుంబ సభ్యులు ఆందోళన కొనసాగించారు. రాత్రి పది గంటలకు కూడా ఆందోళన విరమించలేదు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులు వచ్చే వరకు కదిలేది లేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. దీనిపై ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహేష్‌బాబు వివరణ ఇస్తూ ఒకరు విధుల్లోకి వచ్చినప్పుడు తరచూ గంజాయితో వస్తున్నారని, దీనిపై సమాచారం ఉండడంతోనే వారిద్దరినీ తనిఖీ చేశామన్నారు. జైలు నిబంధనలకు లోబడి, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే నడుచుకుంటున్నామన్నారు.

కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షలకు ఏర్పాట్లు

- అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

విశాఖపట్నం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి ఈనెల 30 నుంచి కైలాసగిరి దిగువన ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. శనివారం ఆయన పరీక్షల నిర్వహణలో పాల్గొనే పోలీసు సిబ్బందితో ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో సమావేశం నిర్వహించారు. దేహదారుఢ్య పరీక్షలకు 11, 568 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, అందులో పురుషులు 9414, మహిళా అభ్యర్థులు 2154 మంది ఉన్నారని తెలిపారు.

జూనియర్ కళాశాల కల నెరవేరేనా?

... 5వ పేజీ తరువాయి

చదువుకోవడానికి అధిక శాతం మంది ప్రైవేటు జూనియర్ కళాశాలలో చేరుతున్నారు. గురుకుల పాఠశాలను రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తే ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువు పూర్తి చేసి ఒకేసారి బయటకు రావచ్చు. ఎక్కువ ఫీజులు చెల్లించి ప్రైవేటు కళాశాలలో చదివించుకునే అవసరం లేకుండా ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. నాణ్యమైన విద్య, వసతి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. ప్రైవేటు కళాశాలలో చదివించుకోవాలంటే ఎక్కువ ఖర్చు అవుతుందని వాపోతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు

అప్పటి ఆర్‌అండ్‌బీ మంత్రి అయ్యన్నపాత్రుడు 2019లో ఏపీ రెసిడెన్సియల్ స్కూల్‌ను ఏపీ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదించారు. దీనిని ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ సొసైటీ.. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లింది. ఇంతలో ఎన్నికలు జరిగి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రతిపాదన మరుగున పడిపోయింది. గురుకుల బాలుర పాఠశాలకు కళాశాల యోగం పడుతుందని ఆశించిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. కూటమి ప్రభుత్వం హయాంలో కళాశాల కల సాకారం అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం


విజయరామరాజుపేటలో గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న పీలా, మళ్ల

అనకాపల్లి టౌన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం గౌరీ పరమేశ్వరుల అనుపోత్సవం వైభవంగా ప్రారంభమైంది. మెయిన్‌రోడ్డులోని కుంచావారి గౌరీ పరమేశ్వరులు, విజయరామరాజుపేటలోని గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కుంచావారి గౌరీ పరమేశ్వరులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, మాజీ ఎమ్మెల్యే కర్రి సీతారాం, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, దేశం నాయకులు మాదంశెట్టి నీలబాబు, గొల్లవిల్లి శ్రీను తదితరులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరిని సత్కరించి అమ్మవారి జ్ఞాపికలను ఆలయ కమిటీ చైర్మన్ ఎం. వీరభద్రరావు, కుంచావారి కుటుంబసభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పలు నేలవేషాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాయంత్రం ప్రత్యేక రథంపై ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి పురవీధుల గుండా ఊరేగించారు.

విజయరామరాజుపేటలో...

విజయరామరాజుపేట గౌరీ పరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజామున ప్రత్యేక పూజలు జరిగిన అనంతరం భక్తులకు కమిటీ ప్రతినిధులు దర్శనం కల్పించారు. పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, మళ్ల సురేంద్ర, వైసీపీ నాయకులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని సత్కరించారు. గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్న వారిలో టీడీపీ నాయకులు కొణతాల రత్నకుమారి, దాడి జగన్, పిట్ల రాజు, పైలా గోపి, భానుచందర్ తదితరులు ఉన్నారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు.

కూటమి జోరు.. వైసీపీ బేజారు

... 5వ పేజీ తరువాయి

సుందరపు విజయ కుమార్(జనసేన), పాయకరావుపేటలో కంబాల జోగులు(వైసీపీ)పై వంగలపూడి అనిత(టీడీపీ) ఘన విజయం సాధించారు.

కూటమి నేతలను వరించిన పదవులు

కూటమి ప్రభుత్వంలో జిల్లాలో ఈ ఏడాది పలువురికి రాష్ట్ర స్థాయిలో రాజకీయంగా ప్రాధాన్యం దక్కింది. నర్సీపట్నం ఎమ్మెల్యే సీహెచ్ అయ్యన్నపాత్రుడుకి శాసనసభ స్పీకర్ పదవి, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితకు హోం మంత్రి పదవి దక్కాయి. అలాగే మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా, టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగిన బత్తుల తాతయ్యబాబుకు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావుకు రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా, టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్‌కు వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన పలువురు నాయకులకు వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా పదవులు దక్కాయి.

వైసీపీ నేతల చూపు కూటమి వైపు..

జిల్లాలో పలువురు వైసీపీ నాయకులు పార్టీ మారారు. ఇటీవల విశాఖ డెయిరీ చైర్మన్ అడారి ఆనంద్‌కుమార్‌తో పాటు పలువురు డైరెక్టర్లు, ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి బీజేపీలో చేరారు.

కొందరు వైసీపీ సీనియర్ నాయకులు బీజేపీలో చేరారు. అలాగే మరికొందరు ముఖ్య నేతలు కూటమి పార్టీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నియోజకవర్గంలో లక్ష ఉద్యోగాలు

... 5వ పేజీ తరువాయి

విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, నాలుగు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, అధిక సంఖ్యలో అభ్యర్థులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన దృశ్యం

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

మెగా జాబ్‌మేళాకు నిరుద్యోగ యువత నుంచి విశేష స్పందన లభించింది. ఈ జాబ్‌మేళాలో 53 జాతీయ, బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయి. పాయకరావుపేట నియోజకవర్గంతోపాటు వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత తరలివచ్చారు. 2,750 మంది అభ్యర్థులు హాజరుకాగా, 826 మంది ఎంపికయ్యారు. వీరిలో 300 మందికి అప్పటికప్పుడే ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు.

క్రైం... crime news

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి తీవ్ర గాయాలు


ప్రమాద దృశ్యం

పరవాడ, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎలమంచిలి - గాజువాక ప్రధాన రహదారిలోని స్థానిక గౌతులచ్చన్ననగర్ కూడలి వద్ద శనివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ.బోనంగి పంచాయతీ పరిధి బొద్దపువానిపాలెంలో నివాసముంటున్న అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై గౌతులచ్చన్న నగర్ కూడలికి బయలుదేరి వెళుతున్నాడు. మార్గమధ్యంలో ఫార్మా పునరావాస కాలనీకి చెందిన బొద్దపు ధనలక్ష్మి లిఫ్ట్ అడగడంతో అతను తన బైక్‌పై ఆమెను ఎక్కించుకుని వెళుతున్నాడు. ఈ క్రమంలో గౌతు లచ్చన్ననగర్ కూడలిని దాటుతుండగా ఎలమంచిలి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు వీరిని బలంగా ఢీకొట్టింది. దీంతో అనిల్‌కుమార్, ధనలక్ష్మి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ప్రమాదానికి కారకుడైన బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

మేనల్లుడిని హతమార్చిన మేనమామ

మద్యం మత్తులో అఘాయిత్యం.. నిందితుడి అరెస్టు


హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి

చోడవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగే విషయంలో మేనల్లుడు, మేనమామల మధ్య తలెత్తిన ఘర్షణ హత్యకు దారితీసింది. పట్టణంలోని రెల్లివీధిలో నివాసం ఉంటున్న సోమాదుల ప్రేమ్‌కుమార్, అతని మేనమామ బంగారు దుర్గా ప్రసాద్ ఇద్దరూ చిత్తుకాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరికి మద్యపానం వ్యసనంగా మారింది. ఈ నేపథ్యంలో మందు తాగేందుకు డబ్బుల విషయంలో వీరిద్దరి మధ్య శుక్రవారం ఉదయం ఘర్షణ చోటుచేసుకుంది. తనకు తెలియకుండా, తనకు డబ్బులు ఇవ్వకుండా మేనల్లుడు ఒక్కడే మద్యం తాగేస్తున్నాడన్న కోపంతో శుక్రవారం రాత్రి స్థానిక పాతబస్టాండ్ స్టేజి వద్ద నిద్రపోతున్న మేనల్లుడు ప్రేమ్‌కుమార్‌పై దుర్గా ప్రసాద్ కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో ప్రేమ్‌కుమార్ తలకు బలమైన గాయమై సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు శనివారం నిందితుడు దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు. నిందితుడిని విచారిస్తున్నామని ఆయన తెలిపారు. శనివారం అనకాపల్లి డీఎస్పీ శ్రావణి హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604